విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

బుధవారం 14 ఆగస్టు 2024 | 8 పేజీలు

భూ సమస్యలకు చెక్

- రెవెన్యూ ప్రక్షాళనకు కూటమి ప్రభుత్వం శ్రీకారం
- 90 రోజుల్లో పరిష్కారం
- 16 నుంచి నిర్వహణకు ఏర్పాట్లు
- 45 రోజులపాటు గ్రామసభలు

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: గ్రామాలలో పేరుకుపోయిన భూ సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం నడుం బిగించింది. అందు కోసం 45 రోజుల కాల వ్యవధితో నిర్దిష్ట కార్యా చరణను చేపట్టింది. ఈనెల 15వ తేదీన రెవెన్యూ సదస్సుల కార్యక్రమం లాంఛనంగా ప్రారంభమవు తుంది. 16 నుంచి 45 రోజులపాటు గ్రామాల్లో అధికారులు సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. ఆ తర్వాత 45 రోజులలో సమస్య పరిష్కరించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో పెద్ద ఎత్తున భూ దందాలు సాగాయి. తమకు అనుకూలంగా ఉండే అధికారులు, సిబ్బందిని నియమించుకొని వారి అండదండలతో అనేక భూ మాయలు చేశారు. ఉమ్మడి జిల్లాలో విలువైన ప్రభుత్వ భూములు, వివాదాలలో ఉన్న స్థలాలను తమకు అనుకూలంగా రాయించుకున్నారు. చాలాచోట్ల రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి ఆ భూములను బడా నేతలు ఆక్రమించుకొని అసలు హక్కుదారులకు చుక్కలు చూపించారు. ఇక 22(ఎ)లో ప్రైవేటు భూములను చేర్పించడం, అనేకమందిని వేధించడం, తనకు అనుకూలంగా ఉన్న భూములను 22 (ఎ)నుంచి తప్పించి వారి పేర్లపై రాయించుకోవడం చేశారు. వందల కోట్ల విలువైన భూములు ఇలా సొంతం చేసుకున్నారు. రీ సర్వే జరిగిన గ్రామాలలో అధికారులు హడావుడిగా చేసిన ప్రక్రియతో వందలాది సమస్యలు వచ్చి పడ్డాయి.

భూ సమస్యలపై ప్రభుత్వం దృష్టి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే భూ సమస్యలపై దృష్టి పెట్టడం ప్రజలకు ఊరట కలిగిస్తోంది. ప్రజల ▶మిగతా 2లో..

16 నుంచి రెవెన్యూ సదస్సులు

- గ్రామాల వారీగా నిర్వహణకు ప్రణాళిక
- సదస్సులకు అవసరమైన రెవెన్యూ రికార్డులను సిద్ధం చేసుకోండి
- కలెక్టర్ మహేష్ కుమార్

విశాలాంధ్ర - అమలాపురం : రాష్ట్ర ప్రభుత్వం భూ సంబంధిత సమస్యలను పరిష్కరించడానికి ఆగస్టు 16 నుంచి సెప్టెంబర్ 30 వరకు రెవెన్యూ సదస్సుల నిర్వహణకు ఆదేశాలు ఇచ్చిందని, ఇందుకు రెవెన్యూ యంత్రాంగం మొత్తం సమాయత్తం కావాలని కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ తహశీల్దార్లను ఆదేశించారు. మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతితో ▶మిగతా 2లో..

దేశభక్తి పెంపొందేందుకు హర్ ఘర్ తిరంగా

ఏలూరులో భారీ ర్యాలీ

విశాలాంధ్ర-ఏలూరు: జాతీయ సమైక్యత, సమగ్రతలను చాటిచెప్పే జాతీయ జెండాను ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై ఎగురవేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. స్థానిక ఇండోర్ స్టేడియంలో మంగళవారం క్రీడలు, పర్యాటక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి .ధాత్రిరెడ్డితో కలిసి ప్రజలచే 'హర్ ఘర్ తిరంగా' ప్రతిజ్ఞను జిల్లా కలెక్టర్ చేయించారు.అనంతరం ఇండోర్ స్టేడియం నుండి ఫైర్ స్టేషన్ వరకు నిర్వహించిన ర్యాలీ ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగా మనం ఈ రోజు స్వేచ్ఛావాయువులను పీలుస్తున్నామన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా ఆ అమరవీరుల స్ఫూర్తితో దేశ అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ అంకితం కావాలన్నారు. ప్రతీ ఒక్కరిలో దేశభక్తి ప్రతిబింబించే విధంగా ఎప్పుడూ

మననం చేసుకుంటూ, జాతీయ జెండాను వారి ఇంటిపై ఎగురవేయాలన్నారు. స్వాతంత్ర్య సంగ్రామ కాంక్షను రగిల్చిన ఆనాటి స్వాతంత్రోద్యమ ఘట్టాలను ప్రతీ ఒక్కరూ స్మరించుకుంటూ ఉండాలన్నారు. ఈ ర్యాలీలో 125 అడుగుల పొడవు గల జాతీయ జెండా పట్టుకుని విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని దేశభక్తిని చాటారు. నగర ప్రధాన కూడళ్లలో సుమారు ▶మిగతా 2లో

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పేర్కొన్నారు. మంగళ వారం కొయ్యలగూడెం మండల కేంద్రంలో సీపీఐ సాధారణ సమావేశం సీపీఐ సీనియర్ నాయకులు దుగ్గిరాల నారాయణరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణ చైతన్య మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని మార్చి వేస్తానని చెప్పిన మోడీకి దేశ ప్రజలు ఓటు రూపంలో తగిన గుణపాఠం చెప్పారని, బీజేపీ స్వతంత్రంగా ప్రభుత్వం ఏర్పాటు చేయలేక ప్రాంతీయ పార్టీలపై ఆధారపడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని, రాష్ట్రంలో జగన్ బిజెపితో లోపాయి కారి ఒప్పందం లేకుండా ఉండి ఉంటే జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులై గెలిపించే వారని తెలిపారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం

ఎన్నికలలో హామీ ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్ర రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం రూ.15 వేల కోట్లు అప్పుగా ఇచ్చి మొండి చెయ్యి చూపించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, సామాన్య మానవుడు బ్రతకాలంటే కష్టతరంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తులకు రూ.14 లక్షల 56 వేల కోట్ల రుణమాఫీ చేశారని, రైతులకు మాత్రం ఎటువంటి రుణమాఫీలు చేయడం లేదని కార్పొరేట్ శక్తులకు మోడీ కొమ్ముకాస్తున్నారని ధ్వజమెత్తారు. గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలకు, యువత బానిసలవుతున్నారని ▶మిగతా 2లో

బ్లాక్‌స్పాట్స్ వద్ద ప్రత్యేక భద్రత

విశాలాంధ్ర- భీమవరం టౌన్: జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రత్యేక భద్రత చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్.పి. అద్నాన్ నయీం అస్మి అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ సి. నాగరాణి ఆధ్వర్యంలో రహదారి భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. అనం తరం ఎస్.పి మాట్లాడుతూ జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించామన్నారు. జంక్షన్లు, ముఖ్యంగా జాతీయ రహదారితో, స్థానిక రహదారులు కలిసే ప్రదేశాల్లో ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఇలాంటి చోట్ల ప్రమాద నివారణ చర్యలను తీసుకోవాల్సి ఉందన్నారు. జాతీయ రహ దారుల జంక్షన్ల వద్ద లైటింగ్ పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆర్అండ్‌బి, జాతీయ రహదారులు, పంచాయతీ, మున్సిపాల్టీలు తమ రోడ్లపై

ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి, జాబితాను అందజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్.పి. వి. భీమారావు, జిల్లా అదనపు ఎస్పీ (ఎస్.ఇ.బి.) ఎ.టి.వి రవికుమార్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు : ఆగివున్న లారీని వెనుకనుండి కారు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు వ్యక్తులు మృత్యుఒడికి చేరిన సంఘటన ఏలూరు జిల్లాలో చోటు చేసుకుంది. ఈ విషాద సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి గ్రామానికి చెందిన యాగంటి సుబ్రమణ్యం (50), దొమ్మేటి నాగార్జున (35), దొమ్మేటి మనోజ్ కుమార్ మంగళవారం

విజయవాడ వ్యక్తి గత పనులపై వెళ్లి తిరిగి కారులో వస్తుండగా దెందులూరు మండలంలోని సత్యనారాయణపురం గ్రామంలోని జాతీయ రహదారి వద్దకు వచ్చేసరికి వీరు ప్రయాణిస్తున్న కారు లారీని ఢీకొనడంతో నాగార్జున, సుబ్రమణ్యంలు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరిని చికిత్స నిమిత్తం హుటాహుటిన ఏలూరులోని సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో మనోజ్ కుమార్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఏకకాలంలో మృతి చెందడం వారి కుటుంబ సభ్యులను శోక సంద్రంలో ముంచేసింది. కేసును దెందులూరు ఎస్ఐ స్వామి నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయస్థాయి కుంపు కరాటే ఛాంపియన్ షిప్‌లో అక్షర విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-ఏలూరు: విజయవాడలో మార్షల్ ఆర్ట్స్ మాస్టర్స్ టీం వారు నిర్వహించిన జాతీయ స్థాయి కుంపు కరాటే ఛాంపియన్‌షిప్‌లో ఏలూరు అక్షర స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ కుంపు కరాటే పోటీలలో కటా విభాగంలో ఆర్.తత్వజ్ఞ, కే.తేజేష్, పి.మోక్షశ్విన్ ప్రథమ స్థానంలో నిలువగా పి. దిపిత, ఎం..జాగృతి, ఎం.రితీష్ ద్వితీయ స్థానంలో నిలిచి పథకాలు సాధించారు. పథకాలు సాధించిన చిన్నారులను మన ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య అక్షర స్కూల్ చైర్మన్ సురేందర్ , ప్రిన్సిపల్ అర్చనా చౌదరి, ప్రశంసించి పథకాలను అందించారు. పిల్లలకు శిక్షణనిచ్చిన మాస్టర్ వేణుగోపాల శ్రీనివాస్‌ను, ఇన్‌స్ట్రక్టర్ సాయికుమార్ ను అభినందించారు.

బేటి బచావో- బేటి పడావో అవగాహన

విశాలాంధ్ర -నూజివీడు : బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ఎస్.ఆర్.ఆర్ గర్ల్స్ హైస్కూల్‌లో నూజివీడు రెవిన్యూ డివిజనల్ అధికారి భవాని శంకరి విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. "మిషన్ శక్తి- 100 రోజుల ప్రత్యేక అవగాహన సదస్సులు" సందర్భంగా "భేటీ బచావో భేటీ పడావో" కార్యక్రమంలో బాలికలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు, ఇతరత్రా అంశాలపై అవగాహన, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ, ఎంఈవో ఉపాధ్యాయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డెంగీ, మలేరియాపై అవగాహన

విశాలాంధ్ర-టి నరసాపురం: డెంగీ, మలేరియా జ్వరాలపై అవగాహన కలిగి వుండాలని బందంచర్ల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆర్. రూన్సీ తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో టీ నరసాపురం మండల వైద్యాధికారి డాక్టర్ జె. కల్యనారాణి ఆదేశాల మేరకు బంధంచర్ల గ్రామంలో పారిశుధ్యం, సీజనల్ వ్యాధుల పై మంగళవారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా రూన్సీ మాట్లాడుతూ ప్రజలు దోమకాటు నుంచి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. దోమతెరలు వాడాలని, మురుగు నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని అన్నారు. పొడుగు దుస్తులు ధరించాలని సూచించారు. జ్వరం, తీవ్ర తలనొప్పి, దగ్గు,కీళ్ల నొప్పులు ఉన్నట్లయితే కమ్యూనిటీ హెల్త్ కేంద్రంలో సంప్రదించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివా లయ కార్యదర్శి రామకృష్ణ, ఏఎన్ఎం టి.రాణి, ఆశ వర్కర్స్ ఎన్. మేరీ, ఉదయమణి, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

దృష్టి సారించండి

(1వ పేజీ తరువాయి)

ఆవేదన వ్యక్తం చేశారు. వీటి నియంత్రణకు ప్రభుత్వం పూనుకోవాలని పేర్కొన్నారు. వ్యవసాయ కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన, మహిళా సంఘాలను బలోపేతం చేసి ప్రజా పోరాటాలే లక్ష్యంగా సీపీఐ పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలవరం నియోజకవర్గ కార్యదర్శి కారం దారయ్య, మండల సహాయక కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు, పట్టణ కార్యదర్శి ఎస్‌కే బాజీ, వెలగల రామారావు, ఎస్. గిరి, ప్రత్తిపాటి గంగరాజు, మహిళా నాయకురాలు ఎల్లిబోయిన లక్ష్మీ,చొక్కా బాలస్వామి, ఇళ్ల లక్ష్మి, చొక్కా వెంకటేష్, వేల్పుల దుర్గారావు, చెక్కిరెడ్డి సోమరాజు, మట్ట రామకృష్ణ, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు

(1వ పేజీ తరువాయి)

కలసి రెవెన్యూ సదస్సుల నిర్వాహణపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆగస్టు 16 నుండి సెప్టెంబర్ 30 వరకు 45 రోజుల పాటు జిల్లాలోని అన్ని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగు తుందని, దీనిలో భాగంగా ఏ గ్రామంలో ఏ తేదీలో సదస్సులు నిర్వహిస్తారనే అంశంపై తగు ప్రణాళికను పకడ్బందీగా సిద్ధం చేయాలన్నారు. ప్రధానంగా మ్యుటేషన్, వెబ్ ల్యాండ్‌లో కరక్షన్‌లు, 1బి, దారి సమస్య, భూ తగాదాలు ఎక్కువగా ఉంటాయని, ఇలాంటి రెవెన్యూ సమ స్యల పరిష్కారానికి ప్రభుత్వం సదస్సులను నిర్వహిస్తున్నదని, ఇందుకు అవసరమైన రికార్డు లను అధికారులు సిద్ధం చేసుకోవా ల న్నారు. 22ఏ, ఫ్రీ హోల్డ్ భూములకు సంబం ధించి అన్ని విషయాలను పరిశీలించి అందుకు సంబం ధించి రికార్డులను సిద్ధం చేసుకోవాల న్నారు. వీఆర్వోలు విలేజ్ సర్వేయర్లు సచివాలయ స్థాయిలో గ్రామసభలు నిర్వహించి రైతుల సమస్యలను ఈ 45 రోజుల్లో అర్జీల రూపంలో తీసుకోవాలన్నారు. మరో 45 రోజులలో సమస్యల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి పెట్టి మండల బృందం సమర్థవంతంగా పని చేయాల న్నారు. సదస్సుల నిర్వహణకు ముందుగానే వీఆర్ఓలు, వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బందితో తహశీల్దార్లు ముందస్తు సమావేశం నిర్వహించు కుని, సదస్సుల నిర్వహణ పై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. సదస్సులో తహశీల్దార్‌లు, ఆర్ఐ, సర్వేయర్లు అన్ని రకాల రికార్డులను తీసుకు వచ్చి పరిశీలించడంతో పాటు ఏ సమస్యకైనా నిర్ణీత సమయంలోపు నోటీసులిచ్చి పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజున లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అమలా పురం ఆర్డీవో జి కేశవర్ధన్ రెడ్డి, కొత్తపేట ఆర్డీఓ జెవివి సత్యనారాయణ, రామచంద్రాపురం ఆర్డీవో ఎస్. సుధా సాగర్, సర్వే ఏడి ప్రభాకర రావు, తహసిల్దార్లు, డిప్యూటీ తహసిల్దార్‌లో, సర్వేయర్లు, ఆర్ఐలు వీఆర్వోలు, తదితర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యలకు చెక్

(1వ పేజీ తరువాయి)

వద్దకు పాలన తరహాలో నిర్వహించనున్న ఈ కార్యక్రమం 45 రోజులపాటు సాగనుంది. మండలాన్ని యూనిట్‌గా గ్రామాల వారి నిర్వహించే సదస్సులకు తహసీల్దారు నేతృత్వం వహిస్తారు. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్, దేవాదాయ, వక్ఫ్, అటవీ తదితర శాఖల అధికారులు హాజరవుతారు. 2019 ముందు భూస్థితి, ప్రస్తుత స్థితిని వారు పరిశీలించడంతో పాటు రికార్డులు అందుబాటులో ఉంచుతారు. అలా నిర్వహించే సదస్సులో వచ్చే వినతులను మ్యూటేషన్, కౌలు రైతు కార్డులు,భూ వివాదాలు,భూ ఆక్రమణలు, 22 (ఎ) ప్రక్షాళన తదితరు వివరాలను రిజిస్టర్లో నమోదు చేయను న్నారు. అనంతరం వాటిని 90 రోజులలోపు పరిష్కారం చేస్తారు.ఈ కార్యక్రమం వలన క్షేత్రస్థాయిలో అక్రమాలు వెలుగు చూడనున్నాయి.

పత్రాల ప్రదర్శన

సదస్సులపై తొలుత రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, రైతు సంఘాల ప్రతి నిధులు, ఎంపీలు, ఎమ్మెల్యేలను ఆహ్వానించి సన్నాహక సమావేశాన్ని కలెక్టర్ నిర్వహిస్తారు. గ్రామాలలోని ముఖ్య ప్రదేశాలలో వీటిని జరుపుతారు. సదస్సుకు రెండు రోజుల ముందు ఆ గ్రామానికి సంబంధిం చిన అడం గల్, పహాణి, ప్రభుత్వ భూ రిజిస్టర్ కాఫీలు ముద్రించి వీఆర్ఓ ప్రదర్శిస్తారు. స్వీకరించిన అర్జీలకు రసీదులు తక్షణం తీసుకున్న చర్యలకు సంబంధించి నివేదిక అందించాలి.

అధికారిక బృందాలు

జిల్లా జాయింట్ కలెక్టర్‌ను సదస్సుల సమన్వయకర్తగా నియమిస్తారు. సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, సదస్సుల షెడ్యూల్ ఖరారు చేయాలని ఇప్పటికే ఉన్నతాధికారులు ఆదేశం చారు. వీటిపై ప్రజలలో అవగాహనకు విస్తృత ప్రచారం చేయను న్నారు. కరపత్రాలు, గోడ పత్రికలు, పంపిణీ చేస్తారు. అధికారిక గ్రంథంలో తహసిల్దార్, ఆర్.ఎస్.ఐ, సంబంధిత గ్రామాల వీఆర్ఓ, మండల సర్వేయర్, దేవాదాయ శాఖ అధికారి, అవసరమైన చోట వక్ఫ్ బోర్డు ప్రతినిధి, రిజిస్ట్రేషన్, అటవీ శాఖల అధికారులు ఉంటారు. మండలానికి ఒక నోడల్ అధికారిని కలెక్టర్ నియమిస్తారు.

ప్రత్యేక పర్యవేక్షణ

జిల్లాకు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని ప్రభుత్వం నియమించనుంది.గ్రామ, మండల స్థాయిలో అందిన వినతులు, ఫిర్యాదులను స్వీకరించి, పరిష్కరించే యంత్రాంగాన్ని ఆ అధికారి పర్యవేక్షిస్తారు. సకాలంలో పరిష్కారానికి ప్రయత్నిస్తారు. ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్‌లో పొందు పరుస్తారు. సెప్టెంబరు నెలాఖరు వరకు సదస్సులు కొనసాగిస్తారు.

అభ్యంతరాల స్వీకరణ

గ్రామంలో రీ సర్వే పూర్తయినట్లయితే నూతనంగా తయారు చేసిన ఆర్ఓఆర్ ను చదివి అభ్యంతరాలు స్వీకరిస్తారు. పార్టీ లోగోలు, యంత్రాలతో గతంలో జారీ చేసిన బిహెచ్ఎస్సి లను తిరిగి సేకరిస్తారు. రైతులకు తాజాగా పట్టాదార్ పాస్ పుస్తకాలను జారీ చేస్తారు. సదస్సులు జరిగే 45 రోజులలో అత్యధికంగా సమస్యలు పరిష్కారానికి ప్రయత్ని స్తారు. ప్రతి రెవెన్యూ గ్రామంలో సదస్సు పూర్తి అయిన తర్వాత దానికి సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. కలెక్టర్, చేసి, సదస్సులలో తప్పనిసరిగా పాల్గొనాలి. ఆర్డీవోలు ప్రతి మండలంలోనూ రెండు గ్రామాలను సందర్శించాలి. ఒక్కోసారి మంత్రులు ఆకస్మికంగా పాల్గొంటారు. సదస్సుల నిర్వహణకు ప్రతి జిల్లాకు రూ.8 నుండి రూ. 10 లక్షలు విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

యంత్రాంగం కసరత్తు

ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో గ్రామ సదస్సుల నిర్వహణకు అధికార యంత్రం కసరత్తు చేస్తోంది.ఈనెల 15న లాంఛనంగా ప్రారంభం కానున్న ఈ కార్యక్రమ నిర్వహణలో కీలకమైన గ్రామ సదస్సులు షెడ్యూల్ ను ఖరారు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. మండలం యూనిట్ గా రూపొందించాల్సి ఉండటంతో తహసీల్దార్లు దీనిపై దృష్టి సారించారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

విశాలాంధ్ర - మొగల్తూరు : మొగల్తూరు గ్రామపంచాయతీ పరిధి నాగదేవత కాలనీలో 1లక్ష 25 వేలు నిధులతో ఎనిమిది కరెంటు స్తంభాలు మంగళవారం ఏర్పాటు చేశారు. మొగల్తూరు గ్రామ సర్పంచ్ పడవల మేరీ సత్యనారాయణ, 6వ వార్డు సభ్యులు మద్దూరి మాణిక్యం, పెద్దిరాజు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు కర్రి సూర్యనారాయణ, కాలనీ పెద్దలు కాళ్ళకూరు ఏసు, మన్నే సాయి, కందుల సత్యనారాయణ, దత్తూరి ఏసు తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి రెవెన్యూ సదస్సులు

విశాలాంధ్ర - కలిదిండి: కలిదిండి మండలంలో ఈనెల 16 నుంచి వచ్చే నెల 13 తేదీ వరకు ప్రతి రెవిన్యూ గ్రామంలో గ్రామ సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాల వద్ద రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తహసీల్దారు రామకృష్ణ మంగళవారం తెలిపారు. గ్రామస్థాయిలో భూములకు సంబంధించిన అన్ని సమస్యలు పరిష్కరించేందుకు రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తున్నా మన్నారు. ఉదయం 9 గంటల నుంచి ఆయా గ్రామ పంచాయతీ, సచివాలయాల వద్ద జరుగుతాయని అన్నారు. 16న తాడినాడ, 19న పోతుమర్రు, 21న కాళ్ల పాలెం, 23న కొండూరు, 24న వెంకటాపురం, 27న కలిదిండి, 29న సానారుద్రవరం, 30న కోరుకొల్లు, 2న ఆవకూరు, 4న కొచ్చర్ల, 6 న కొండంగి, 9న మట్టగుంట, 11న అమరావతి, 13న పెద్దలంక గ్రామాలలో రెవిన్యూ సదస్సులు జరుగుతాయని తెలిపారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అమోఘం

విశాలాంధ్ర - కామవరపుకోట : హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ద్వారా చేపడుతున్న సేవలు అమోఘమని కామవరపు కోట మండల జనసేన నాయకులు బొబ్బిలి వీర బాబు అన్నారు. కామ వరపుకోటలో హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ద్వారా గత ఐదేండ్లుగా ఆసరా లేని వృద్ధులకు, వికలాంగులకు వారి వద్దకే భోజనం తీసుకు వెళ్లే కార్యక్రమం కొనసాగుతున్న సంగతి విధితమే. జనసేన నాయకులు వీరబాబు పుట్టిన రోజును పురస్కరించుకొని హెల్పింగ్ హ్యాండ్ సంస్థ ద్వారా రెండు రోజులు పాటు భోజనం అందించడానికి ముందుకు వచ్చిన వీరబాబు కు సంస్థ చైర్మన్ పాపారావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు బొబ్బిలి వీరబాబు మాట్లాడుతూ అన్ని దానాల్లో కన్నా అన్నదానం మిన్న అని, హెల్పింగ్ హ్యాండ్ సంస్థకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.

ఆ రోజులు తలచుకుంటే ఆనందం

విశాలాంధ్ర-వీరవాసరం: తాము చదువుకున్న రోజులను తలచుకుంటే ఎంతో ఆనందంగా ఉందని పలువురు తెలిపారు. స్థానిక ఎంఆర్కే పాలిటెక్నిక్ కళాశాలలో 1994- 97 మధ్య చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సందడి వాతావరణం లో ఘనంగా జరిగింది. చిన్ననాటి స్నేహితులంతా ఒకచోట చేరితే ఆ సందడే వేరు. ఇక్కడ చదివి దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులంతా హాజరై అలనాటి స్మృతులను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందజేస్తామ న్నారు. అప్పటి అధ్యాపకులు మద్దాల తాతారావు, కేవీ రెడ్డి, కేవీఎల్ నరసింహారావులను ఘనంగా సత్కరించారు. ఈ సమ్మేళనానికి అప్పటి విద్యార్థులు శ్రీకాంత్, సునీల్, నిరంజన్లు కృషి చేశారు.

హర్‌ఘర్ తిరంగా

(1వ పేజీ తరువాయి)

800 మంది ర్యాలీ లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి డి. పుష్పమణి, ఆర్డీఓ ఎన్. ఎస్. కె.ఖాజావలి,ఎస్డీసీ లు ఎం. ముక్కంటి, కె. బాబ్జి,సెట్ వెల్ ఇంచార్జి సీఈఓ మధుభూషణరావు, జిల్లా పర్యాటక శాఖ మేనేజర్ ఎన్. పట్టాభిరామయ్య, ఐసిడిఎస్ పీడీ పద్మావతి, ఏలూరు నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతీ,జిల్లా విద్యా శాఖాధికారి అబ్రహం, ఉద్యానవనాలు శాఖ డిడి రామ్మోహనరావు, బిసి. కార్పొరేషన్ ఈడి నాగరాణి, డిఎస్డీఓ శ్రీనివాసరావు, ప్రభుతులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్ష ఫలితాలు వెల్లడి

విశాలాంధ్ర -తణుకు: స్థానిక ఎస్ కే ఎస్ డి మహిళా కళాశాల డిగ్రీ, పీజీ (అటానమస్) జులై 2024 నిర్వహించిన డిగ్రీ ప్రథమ సంవత్సరం రెండవ సెమిస్టర్ ద్వితీయ సంవత్సరం నాలుగో సెమిస్టర్ పరీక్షా ఫలితాలను కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి మంగళవారం విడుదల చేశారు. ప్రథమ సంవత్సరం రెండవ సెమిస్టర్ నందు 79%, ద్వితీయ సంవత్సరం నాలుగో సెమిస్టర్ నందు 81% ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ తెలియజేశారు. పరీక్ష ఫలితాలను సకాలంలో విడుదల చేసినందుకు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కెవి రామకృష్ణ, అసిస్టెంట్ కంట్రోలర్ ఎన్ఎస్వివిఎస్ఏ కుమార్‌లను అభినందించారు. ఈ సందర్భంగా ట్రెజరర్ నందిగం సుధాకర్, జాయింట్ సెక్రెటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు, కళాశాల అధ్యాపకులు ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థినులను అభినందించారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు అరికట్టాలి

విశాలాంధ్ర - కైకలూరు : బంగ్లాదేశ్ లో ఇటీవల కాలంలో చెలరేగిన హింసకాండలో హిందువులపై దాడులు ఎక్కువయ్యాయని వాటిని అరికట్టాలని హిందూ సంఘాలు డిమాండ్ చేశాయి.హిందువులపై దాడికి వ్యతిరేకంగా కైకలూరు కలిదిండి గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా కైకలూరులో శ్రీ శ్యామలాంబ ఆలయం వద్ద నుండి హిందూ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.తాలూకా సెంటర్ వరకు జరిగిన ర్యాలీలో పెద్ద ఎత్తున హిందువులు పాల్గొని బంగ్లాదేశ్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కీర్తి వెంకట రాంప్రసాద్, మేడిశెట్టి పాములు,శ్యామలరావు, యానాల బసవయ్య, సాయి,గిరి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం నిరుపేదలకు వరం

విశాలాంధ్ర- ఉంగుటూరు : ఉపాధిహామీ పథకం నిరుపేదల జీవనోపాధికి వరం లాంటిదని ఉంగుటూరు ఈవోపీఆర్డి కె.వి గిరిధర్ అన్నారు. మంగళవారం ఉంగుటూరు కమ్యూనిటీ హాల్లో ఉపాధ్యామీ జాబ్ కార్డులపై గ్రామ సభ జరిగింది. సర్పంచ్ బందారు సింధు మధుబాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిరుపేద కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు పాతూరి విజయ్ కుమార్, గ్రామ ఉప సర్పంచ్ పాతూరి జగదీష్, పంచాయతీ వార్డు సభ్యులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ అసరపల్లి కనకారావు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరిది బాధ్యత

విశాలాంధ్ర-ఏలూరు: మిషన్ శక్తి బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమం క్రింద నూరు రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహణలో భాగంగా మంగళవారం ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లోని ఐసిడిఎస్ కార్యాలయం వద్ద జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివకిషోర్, జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మొక్కలను నాటారు. నషా ముక్త్ అవగాహన కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ ప్రాంగణంలో కూడా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివకిషోర్, జెసి పి. ధాత్రిరెడ్డి, పలువురు జిల్లా అధికారులు మొక్కలు నాటారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని, అందుకు ప్రతీ ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పిలుపు నిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు ప్రధాన కర్తవ్యం మొక్కలను పెంచడమేనని, ప్రతీ ఒక్కరూ పుట్టినరోజు, పెళ్లిరోజు వంటి రోజులలో విరివిగా మొక్కలను నాటే అభిరుచిని కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి డి. పుష్పమణి, ఆర్డీఓ ఎన్. ఎస్. కె. ఖాజావలి, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడి రాకడ మణి, ట్రాన్స్కో ఎస్ఈ సాల్మాన్ రాజు, ఏపిఎంఐపి పీడీ రవికుమార్, డిసిహెచ్ ఎస్ డా.పాల్ సతీష్, ఎస్సీ లు ఎం. ముక్కంటి, కె. బాబ్జి, ఐసిడిఎస్ పీడీ పద్మావతి, ఏలూరు నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతీ, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి ఘంటా సుధాకర్, పలువురు ఎక్సైజ్ పోలీసు అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రభుతులు పాల్గొన్నారు.

సమాజ మనుగడకు చట్టాలపై అవగాహన

విశాలాంధ్ర - ముదినేపల్లి : సమాజ మనుగడకు చట్టాలపై ప్రతి వ్యక్తి అవగాహన కలిగి ఉండాలని మండల లీగల్ సెల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ వివిఎస్వి లక్ష్మి అన్నారు. మండలంలోని పెయ్యేరు గ్రామంలో ఎస్టీ కాలనీలో న్యాయ విజ్ఞాన సదస్సు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు వర్గాలు అలిసివేతకు గురై న్యాయపరమైన సూచనలు , సలహాలు అందించి వారిని ఆదుకోవడం జరుగుతుందన్నారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబాటుతో ఉన్న వారు, మహిళలు, యువత, విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాల న్నారు. పిహెచ్సి వైద్యురాలు ఎన్ శ్వేత గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య పరిస్థితులు ఎంత మెరుగుపరుచుకోవాలో వివరించారు. ఉచిత వైద్య శిబిరంలో వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ డి.శివకుమార్, లాయర్ ఎంఎస్ఎస్ రాజు, ఎం ఎల్ హెచ్ పి డి ఉషారాణి, వీఆర్వో కేశవ, ఏఎన్ఎంలు , ఆశవర్కర్లు పాల్గొన్నారు.

ట్రిబుల్ ఐటీ విద్యార్థులకు ఇంటర్న్ షిప్

విశాలాంధ్ర -నూజివీడు :ట్రిబుల్ ఐటీలో నాల్గవ సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులు పెయిడ్ ఇంటర్న్‌షిప్‌లను పొందారు. హైదరాబాద్‌కు చెందిన "ప్రీమియర్ ఎనర్జీ ఫోటోవోల్టాయిక్ ప్రైవేట్ లిమిటెడ్" అనే కంపెనీకి 18 మంది ఇఇఇ విద్యార్థులు ఆరు నెలల ఇంటర్న్‌షిప్ కోసం ఎంపికయ్యారు. వీరు ఇంటర్న్‌షిప్ సమయంలో నెలకు రూ. 15,000 స్టైఫండ్‌గా అందుకోనున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రొఫెసర్ ఎం. చంద్రశేఖర్, డైరెక్టర్ టి. చంద్రశేఖర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రత్నాకర్ విద్యార్థులను అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో హాజరుశాతం పెంచండి

విశాలాంధ్ర - తణుకు : ప్రభుత్వ పాఠశాలలలో హాజరు శాతం పెంచాలని తణుకు శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ సూచించారు. నూతనంగా నియమితులైన స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులతో ఆయన మంగళవారం సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలనలో పాఠశాలను పట్టించుకోకుండా పూర్తిగా భ్రష్టు పట్టించారని అన్నారు. విద్యాశాఖ మంత్రిగా లోకేష్ ప్రభుత్వ పాఠశాలలోనే ఎందుకు చదవాలి అనే నినాదంతో విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకు వస్తున్నారని తెలిపారు. దానికి అనుగుణంగా నూతన మేనేజ్మెంట్ కమిటీ లు నియమించుకున్నామన్నారు. ఎన్నికైన వారు ప్రతి స్కూల్‌లో కూడా మంచి ఫలితాలు వచ్చే విధంగా , మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు తెలుగుదేశం జనసేన బిజెపి మండల నాయకులు నూతనంగా నియమించ బడ్డ ఎస్.ఎమ్ సి చైర్మన్లు, వైస్ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పొందడంలో సమస్యలుంటే న్యాయ సహకారం

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రభుత్వం అందించే వితంతు పింఛన్ పథకం కోసం ఇబ్బందులు ఎదురైతే న్యాయ సహాయాన్ని అందిస్తామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ స్పష్టం చేశారు.

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో వితంతు పింఛను పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ మాట్లాడుతూ వితంతు పింఛనుకు అర్హులై ఈ పథకాన్ని పొందడంలో సమస్యలుంటే జిల్లా న్యాయ సేవాధికారి సంస్థను సంప్రదించాలని, అటువంటి వారికి అవసరమైన సహాయాన్ని అందిస్తుందని సూచించారు. సెప్టెంబర్ 14వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారని ఎవరికైనా సివిల్, రాజీయోగ్యమైన క్రిమినల్ కేసులు ఉన్న సంబంధిత కోర్టులను గాని న్యాయ సేవాధికార సంస్థలను గాని సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పింఛను ప్రాజెక్ట్ ఆఫీసర్ కృష్ణమూర్తి, పానల్ లాయర్ కూనా కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

శునకాలకు కుటుంబ నియంత్రణ

విశాలాంధ్ర -భీమవరం: వీధి శునకాలకు కుటుంబ నియంత్రణ, ర్యాబీస్ వాక్సిన్ వేసే కార్యక్రమం చేపట్టామని, పౌరులు, జంతు ప్రేమికులు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల విజ్ఞప్తి చేశారు. స్నేహ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు మున్సిపల్ కమిషనర్ ను మంగళవారం కలిశారు.

ఈ సందర్భంగా శ్యామల మాట్లాడుతూ జంతు సంక్షేమ బోర్డు అనుమతి పొందిన స్నేహ వెల్ఫేర్ సొసైటీ భీమవరంలో వీధి శునకాలకు కుటుంబ నియంత్రణ, ర్యాబీస్ వాక్సిన్ వేసే టెండర్ దక్కించుకుందని వీరు వీధి శునకాలను పశువుల ఆసుపత్రికి తరలించి కుటుంబ నియంత్రణ, వాక్సిన్ తదితర కార్యక్రమాలు పూర్తయ్యాక అవి కోలుకునే వరకు వాటిని సంరక్షించి నాలుగు, ఐదు రోజుల తరువాత వాటిని తీసుకొచ్చిన ప్రాంతాల్లో విడిచి పెడ్తారని ఆమె వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, స్నేహ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని సమస్యల రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు : ప్రజా సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ఏలూరును సమస్యల రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దాలన్నదే తన లక్ష్యమని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు.

ఎమ్మెల్యే బడేటి చంటి నియోజకవర్గ ప్రజల సమస్యలను తెలుసుకునేం దుకు అధిక సమయాన్ని కేటాయిస్తూ వస్తున్నారు. రోజులో తనకున్న సమయంలో కచ్చితంగా కొంత సమయాన్ని ప్రజా వినతులు స్వీకరిం చేందుకు కేటాయిస్తూ ఉండడంతో ప్రజలు కూడా ఆయన్ని కలిసి తమ సమస్యలను తెలిపేందుకు అధిక సంఖ్యలో క్యాంపు కార్యాలయానికి వెళ్తున్నారు. సమస్య పరిష్కార మార్గాలను సైతం అన్వేషిస్తూ వాటిపై అధికారులకు దిశానిర్దేశం చేస్తూ సామరస్యంగా పరిష్కరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, పలువురు కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు.

కళాశాలలో ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ

విశాలాంధ్ర-మండవల్లి : మండల కేంద్రంలోని మండవల్లి గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బేతపూడి రవితేజ ఆధ్వర్యంలో శాసనసభ్యులు డాక్టర్ కామినేని శ్రీనివాస్ చేతుల మీదుగా స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రభుత్వ అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, కళాశాలకు యాజమాన్యానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకువచ్చి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సుకు మాదక ద్రవ్యాల నియంత్రణ

మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన ర్యాలీలో కలెక్టర్, ఎస్పీ

విశాలాంధ్ర-ఏలూరు: సమాజ శ్రేయస్సుకు మాదక ద్రవ్యాల నియంత్రణ ఎంతో ముఖ్య మని కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. "నాషా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నియంత్రణ, దుష్ప్రభావాలపై మంగళవారం ఏలూరు జిల్లా కలెక్టరేట్ నుండి ప్రారంభమైన అవగాహన ర్యాలీని జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివకిషోర్, జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డితో కలిసి కలెక్టర్ కె. వెట్రిసెల్వి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ యువత ఉజ్వల భవిష్యత్తునునాశనం చేసే మాదకద్రవ్యాల వినియోగాన్ని జిల్లాలో పూర్తిగా రూపుమాపేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు నేటి యువత బానిసలై తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. జిల్లాలో గంజాయి, డ్రగ్స్, అక్రమ మద్యం, నాటు సారా అమ్మకాలు, రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టామని, మాదక ద్రవ్యా లను సరఫరా చేసే పెడ్లర్స్‌ను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో మాదక ద్రవ్యాలు సరఫరా చేసే వారిపై ఇంతవరకు 149 కేసులు నమోదు చేసి, 540 మందిని అరెస్ట్ చేశామన్నారు. జిల్లా యంత్రాంగం ఎన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ జిల్లాను మాదకద్రవ్య రహిత తంగా తీర్చిదిద్దేందుకు ప్రజల భాగస్వామ్యం ముఖ్య మన్నారు. మాదక ద్రవ్యాల సరఫరా, వినియోగాలపై ఫిర్యాదుల నమోదు, డి-అడిక్షన్ కేంద్రాల సేవల నిమిత్తం టోల్ ఫ్రీ నెంబర్ 14446 ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివకిషోర్ మాట్లా డుతూ జిల్లా కలెక్టర్ వారి నేతృత్వంలో పోలీస్‌శాఖ మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు. మాదక ద్రవ్యాలు సరఫరా, వినియోగించే వారి సమాచారాన్ని తెలియజేసేవారికి రివార్డులు కూడా ప్రకటించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి డి. పుష్పమణి, ఆర్డీఓ ఎన్. ఎస్.కె. ఖాజావలి, డిసిహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ రాకడ మణి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండాతో కలెక్టర్ సెల్ఫీ

విశాలాంధ్ర - ఏలూరు : ఆజాదిక అమృత్ ఉత్సవ్‌లో భాగంగా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివకిషోర్, జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి మంగళవారం స్థానిక ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన తిరంగా కాన్వాస్ పై సంతకం చేసి జాతీయ జెండాతో సెల్ఫీ ఫోటో తీసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లా డుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు వాడవాడలా జెండా పండుగ నిర్వహించు కుంటున్నామన్నారు. ఆగస్టు 13 నుండి 15వ తేదీ వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి సెల్ఫీ తీసుకొని వెబ్ సైట్‌లో అప్‌లోడ్ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో జిల్లా రెవిన్యూ అధికారి డి. పుష్పమణి, ఏలూరు ఆర్డీఓ ఎన్ఎస్ కె. ఖాజావలి, డిఎన్‌డిఓ బి. శ్రీనివాస్, డిఇఓ అబ్రహం, సెట్‌వెల్ సిఇఓ మధుభూషణ రావు,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యం.ముక్కంటి, పలువురు పోలీసు, ఎక్సైజ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - మొగల్తూరు : మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామంలో ఆరోగ్య వర్షిని ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం అవయవదాన దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సామాజిక సేవా కార్యకర్త నాగిడి రాంబాబు మాట్లాడుతూ అమ్మ జన్మనిస్తే అవయవ దానం పునర్జన్మ నిస్తుందని ప్రతి ఒక్కరూ అవయవదానంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అవయవదానం ద్వారా ఎంతోమంది ఆరోగ్య పరిస్థితులు మెరుగుపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్ చక్రవర్తి ఉపాధ్యాయులు గుడాల తాతారావు ,బొక్క కోటేశ్వరి, ఎం ఎల్ హెచ్ పి బంగారమ్మ, అంగన్వాడి వర్కర్ బర్రె వెంకటేశ్వరమ్మ, కొల్లాటి రుద్రయ్య సురేష్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్వాసితుల భూములతో వ్యాపారం చేస్తే జైలుకే

పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు హెచ్చరిక

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : నిర్వాసిత భూములను కౌలు రూపంలో తీసుకొని వ్యాపారం చేసే వారిపై రౌడీషీట్ తెరిచి జైలుకు పంపిస్తామని పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు హెచ్చరించారు. మంగళవారం గద్దమణుగు రవికుమార్ నివాసం వద్ద పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ భూముల వ్యవహారంపై జరుగుతున్న అవినీతిపై తమ వద్ద ఆధారాలున్నాయని ఎవరెవరు ఎంతెంత భూమిని గిరిజనుల నుండి తక్కువ రేటు కౌలుకు తీసుకుని ఎక్కువ రేటుకు కౌలుకు ఇస్తున్నారో వారందరిని గుర్తించి వారిపై రౌడీషీట్ తెరిచి జైలుకు పంపేందుకు అన్ని చర్యలు సిద్ధం చేస్తున్నామని హెచ్చరించారు. తన నియోజకవర్గంలో నిర్వాసితులకు ఎటువంటి హాని జరిగిన సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గద్దమదుగు రవికుమార్, మండల అధ్యక్షులు పసుపులేటి రాము, అడప నాగరాజు, చిర్రి శ్రీను, కోలా మధు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ఓటర్ల సర్వే నిర్వహించాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా తయారీలో భాగంగా ఇంటింటా ఓటర్ల సర్వే నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యదర్శి వివేక్ యాదవ్ తెలిపారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈఆర్ఓలతో మంగళవారం ఆయన అమరావతి నుంచి వీడియో సమావేశం నిర్వహించారు.సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా రూపొందించడానికి ఈ నెల 20 నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు ఇంటింటా ఓటర్ల సర్వే ప్రక్రియ జరుగుతుందని ఎన్నికల ప్రధాన కార్యదర్శి చెప్పారు. అక్టోబర్ 19వ తేదీ నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన జరుగుతుందన్నారు. అక్టోబర్ 29వ తేదీన సంక్షిప్త ముసాయిదా ఓటర్ల జాబితా రూపొందించాలన్నారు.సెప్టెంబర్ 29 నుంచి నవంబర్ 28వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. తదు పరి ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. డిసెంబర్ 24వ తేదీలోగా అభ్యంతరాలపై వచ్చిన దరఖాస్తుల పరిశీలన, పరిష్కార కార్యక్రమం చేపట్టాలన్నారు. 2025 జనవరి ఒకటో తేదీలోగా నిబంధనల మేరకు జాబితా సిద్ధము య్యిందో లేదో పరిశీలించాలన్నారు. 2025 జనవరి ఆరో తేదీన సంక్షిప్త సవరణ ఓటర్ల తుది జాబితా ప్రచురించాలని ఆయన తెలిపారు. ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాలు పక్కాగా అమలు చేయాలన్నారు. ఈ వీడియో సమావేశంలో జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి జిల్లా రెవిన్యూ అధికారి డి.పుష్ప మణి ,తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ రాష్ట్ర స్థాయి వర్కుషాపు జిల్లా అభివృద్ధికి దోహదం

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు : వికసిత్ వర్క్‌షాపులో చెప్పిన అంశాలు జిల్లా అభివృద్ధితో పాటు పేదరిక నిర్మూలనకు ఎంతగానో దోహదపడుతుందని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాధ్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని 2047 సంవత్సరానికి దేశస్థాయిలో అగ్రగామిగా నిలపడానికి రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ లెవెల్ వికసిత్ ఆంధ్ర కార్యక్రమాన్ని అమరావతిలోని సచివాలయంలో ఏర్పాటు చేసారని అన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని జిల్లాల నుంచి వచ్చిన అధికారులు పాల్గొనగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు జిల్లా నుంచి డీపీఓ, డ్వామా పిడి, డిఆర్డిఏ పిడి, సీపీఓ, స్టాటిస్టికల్ అధికారి తది తరులు వికసిత్ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నా రని అన్నారు. వర్క్‌షాపులో ఎకానమీ పెరుగు దల, అభివృద్ధి పెరుగుదల అంశాలపై అవగాహన కల్పించారని అన్నారు. జీరో పేదరికం ప్రజల జీవనప్రమాణాలు ఏ విధంగా పెంచాలి, ఆర్థిక అసమానతలు దూరం చేయడం, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు కల్పించడం వర్కుషాపులో వివరంగా చెప్పారని అన్నారు. త్వరలో జిల్లాలో కూడా అధికారులతో ఒక వర్కుషాపు ఏర్పాటు చేసి వికసిత్ ఆంధ్ర విజన్ పై అవగాహన కల్పించనున్నామని అన్నారు. కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి విజయ్ రాజ్, డ్వామా పిడి రాము, సీపీఓ బి.శ్రీదేవి, స్టాటిస్టికల్ ఆఫీసర్ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

500 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ

విశాలాంధ్ర- తణుకు: 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో భాగంగా మంగళవారం తణుకు శాసన సభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ తణుకు శ్రీచైతన్య స్కూల్ ఆధ్వర్యంలో దాదాపు 500 అడుగుల భారీ జాతీయ జెండా ర్యాలీలో విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా భారతదేశ స్వాతంత్ర్యం కోసం ఎంతో మంది సమర యోధులు అంకితం చేశారని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఎన్నో మైలు రాళ్లను దాటుకొని భారత్ ప్రపంచంలోనే ప్రఖ్యాతి గాంచిన దేశాల్లో ఒకటిగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచులకు వర్మి కంపోస్టు తయారీపై వర్క్ షాపు

విశాలాంధ్ర- ఉంగుటూరు : ఉంగుటూరు మండలంలో సర్పంచ్, కార్యదర్శులకు రిఫ్రెషర్ ట్రైనింగ్‌లో భాగంగా ఈవోపీఆర్డి కె.వి గిరిధర్ ఆధ్వర్యంలో ఉంగు టూరులో వర్మీ కంపోస్ట్ తయారీపై వర్క్ షాప్ నిర్వ హించారు. సమావేశానికి ఉంగుటూరు సర్పంచ్ బందారు సింధు మధుబాబు అధ్యక్షత వహించారు. సర్పంచులకు, కార్యదర్శులకు చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వద్ద మంగళవారం తీసుకువెళ్లి తయారీ విధానం చూపించారు. ఉంగుటూరు గ్రామ సర్పంచ్ బందారు సింధు మధుబాబు, మండల టిడిపి అధ్యక్షుడు విజయ్ కుమార్, మండలంలో సర్పంచులు కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు జాతీయ జెండాను అందజేసిన పోస్టల్ డిపార్ట్మెంట్

విశాలాంధ్ర- ఉంగుటూరు : భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశం మొత్తం ఘనంగా నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఇండియన్ పోస్టల్ డిపార్ట్మెంట్ వారు ఉంగుటూరులో మంగళవారం ఉంగు టూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కలసి వారికి జాతీయ జెండాను పోస్టల్ డిపార్ట్మెంట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు సబ్ పోస్టల్ మాస్టర్ రామకృష్ణ, పోస్టల్ ఇన్స్పెక్టర్ జి. సుమన్, నిడమర్రు బి పి ఎం పి. ఆంజనేయులు పాల్గొన్నారు.

తుందుర్రులో మిషన్ శక్తి

విశాలాంధ్ర -భీమవరం: భీమవరం మండలం తుందుర్రు అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం మిషన్ శక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివా హాలు అనర్ధాలు, వరకట్నం వేధింపులు, మహిళల పై జరుగుతున్న అత్యాచారాలను నిరోధించేందుకు చేపట్టే చర్యలపై మహిళలకు అవగాహన కలిగించారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్, గల్ఫ్ మోసాలు తదితర అంశాలపై చర్చించారు. 181 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమస్యలను విన్నవించాలన్న అంశంపై చర్చించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సెక్టార్ సూపర్ వైజర్ కనక మహాలక్ష్మి, అంగన్వాడీ, ఆశా, ఎఎన్ఎమ్ లు జ్యోతి, కాశీ అన్నపూర్ణ, ఎం.వజ్రకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఏటిగట్టు, ముంపు పొలాల పరిశీలన

విశాలాంధ్ర - సీతానగరం: ఏటిగట్టు, ముంపు పొలాలను పరిశీలించిన గెయిల్ ఇంచార్జి సబ్ కలెక్టర్ జ్యోతి. మండలంలో బొబ్బిల్లంక గ్రామం వద్ద ఉగ్ర గోదావరి ఉధృతికి ఏటిగట్టు కోతకు గురై ప్రమాదకర స్థాయికి చేరిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఏటి గట్టు పునః నిర్మాణం కోసం జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు నివేదికలు సిద్ధం చేశారు. దీనిపై వాస్తవ పరిస్థితిని పరిశీలించడానికి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకే ఇంచార్జి సబ్ కలెక్టర్ గా బాధ్యతలు చేపడుతున్న గెయిల్ ఇండియా సబ్ కలెక్టర్ జ్యోతి మంగళవారం ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కలిసి పర్యటించి క్షుణ్ణంగా పరిశీలించారు. గ్రామాల పరిధిలో నీట మునిగిన పంట పొలాలను సైతం పరిశీలించి శాశ్వత ముంపు నివారణకు తీసుకోవాల్సిన చర్యల పై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి తహశీల్దార్ మూర్తి, ఇరిగేషన్ ఏఈ శివప్రసాద్, వ్యవసాయ శాఖ ఏఓ సూర్య రమేష్, ఆర్ఐ లక్ష్మీదేవి, విఆర్ఓ వెంకటరావు, రైతులు పాల్గొన్నారు.

కొవ్వూరు - హైదరాబాద్ నాన్ స్టాప్ బస్సు సర్వీసు ప్రారంభం

విశాలాంధ్ర - కొవ్వూరు: ప్రయాణికుల సౌకర్యార్థం కొవ్వూరు ఆర్టీసీ డిపో నుండి పోలవరం కొయ్యలగూడెం జంగారెడ్డిగూడెం మీదుగా అశ్వరావుపేట నుండి నాన్ స్టాప్‌గా హైదరాబాదు చేరుకునే విధంగా బస్ సర్వీసులను ప్రారంభించినట్టు కొవ్వూరు ఆర్టీసీ డిపో మేనేజర్ వైవివిఎన్ కుమార్ తెలి పారు. సోమవారం కొవ్వూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నందు కొవ్వూరు నుండి హైదరాబాదు బస్సు సర్వీసును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వైవివిఎన్ కుమార్ మాట్లాడుతూ కొవ్వూరు నుండి హైదరాబాదు బస్ సర్వీస్ ద్వారా సురక్షితమైన వేగవంతమైన ప్రయాణాన్ని ప్రయాణికులకు అందించడమే లక్ష్యంగా ఈ సర్వీసును ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో గ్యారేజ్ ఇంచార్జ్ ఆర్ సునయన, సూపర్వైజర్ ఎస్ కే మౌలాలి, ప్రయాణికులు ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

విశాలాంధ్ర - చాగల్లు: మాదక ద్రవ్యాల వినియోగంపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కొవ్వూరు ఐసిడిఎస్ సిడిపిఓ మమ్మీ అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగంపై చాగల్లు వెలగపూడి రామకృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమాజంలో మాదక ద్రవ్యాల వినియోగం, సైబర్ క్రైమ్ ద్వారా మహిళలపై జరుగుతున్న నేరాలు పై స్త్రీ శిశు సంక్షేమ ద్వారా ఎటువంటి న్యాయం పొందవచ్చు అనే అంశాలపై విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. చెడు అలవాటు నుంచి సరైన మార్గం వైపు విద్యార్థులను రూపుమాపేందుకు ఉపాధ్యాయులు అందరూ కృషి చేయాలని ప్రిన్సిపాల్ పావని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.మెరికమ్మ, ఎంఈఓలు గురునాథం, సుభాకర్,ఐసిడిఎస్ సూపర్వైజర్లు పద్మావతి, శిరీష మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సర్పంచ్‌లకు రిఫ్రెష్‌మెంట్ ట్రైనింగ్

విశాలాంధ్ర - రావులపాలెం: పంచాయతీ సర్పంచ్‌లకు రిఫ్రెష్ మెంట్ ట్రైనింగ్‌లో భాగంగా రెండవ రోజు పంచాయతీ సర్పంచ్‌ల రిఫ్రెష్ మెంట్ శిక్షణా కార్యక్రమము రావుల పాలెం మండలం రావులపాలెం గ్రామములో గల ఎస్ డబుల్‌యుపిసి షెడ్ నందు అందరు పంచాయతీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పై గ్రామ పంచాయతీకి ఆదాయ వనరుల కోసం గ్రామ పంచాయతీల నందు ప్లాస్టిక్ నిర్మూలన చేయుటకు మాస్టర్ ట్రైనీలతో శిక్షణ నిర్వహించారు.

ధాన్యం బకాయిలు విడుదల

- రైతుల ఖాతాల్లో రూ.35.39కోట్లు జమ
- అన్నదాతల కళ్లల్లో ఆనందం
- శాసనసభ్యులు బండారు సత్యానందరావు

విశాలాంధ్ర - కొత్తపేట: గత ప్రభుత్వం రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి సంబంధించిన బకాయిలను విడుదల చేయడం ద్వారా కూటమి ప్రభుత్వం అన్నదాతల కళ్లల్లో ఆనందాన్ని నింపిందని కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం చేసిన అనేక తప్పుల్ని సరిచేసి ప్రజలకు మేలు చేయడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన అన్నారు. ఒక్క కొత్తపేట నియోజకవర్గంలోనే 5543 మంది రైతులకు సంబంధించిన రబీ ధాన్యం బకాయిలు మొత్తం రూ.35 కోట్ల 39 లక్షలు వారి ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. రైతుల పాలిట కల్పతరువులా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. గత అసెంబ్లీ సమావేశాల్లో రైతులకు రావాల్సిన ధాన్యం బకాయిల తక్షణమే విడుదల చేయాలంటూ శాసనసభ వేదికగా కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఎలుగెత్తారు. రైతులకు నిర్దేశించిన సమయంలో ధాన్యం డబ్బులు విడుదల చేయడం ద్వారా తొలకరి పనులకు ఆటంకం లేకుండా, రైతుల పిల్లల చదువులకు ఇబ్బందులు లేకుండా ఉంటుందని ఆయన శాసనసభ సమావేశాల్లో సభ దృష్టికి తీసుకువెళ్లారు. ప్రభుత్వం దృష్టికి ఈ అంశాన్ని తీసుకుని వెళ్లి రైతులు బకాయిల విడుదల అంశంలో కృషి చేసిన ఎమ్మెల్యే బండారుకు రైతు సంఘాల నాయకులు స్థానిక రైతులు అభినందనలు తెలియజేశారు.

ప్రతి ఇంటిపైన త్రివర్ణ పతాకం ఎగరాలి : జ్యోతుల

విశాలాంధ్ర - జగ్గంపేట: ప్రతి ఇంటిపైన త్రివర్ణ పతాకం ఎగరాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పిలుపునిచ్చారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో నెహ్రూ ఇన్ని సంవత్సరాల్లో మనం సాధించిన ప్రగతిని గుర్తు చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 15స్వతంత్ర దినోత్సవం రోజున ప్రతి ఇంటిపైన త్రివర్ణ పతాకం ఎగరవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్‌వివిఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, కన్నబాబు, అడపా భరత్ బాబు, రేఖ బుల్లి రాజు, జోగారావు, బద్దిసురేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఏరియా మెడికల్ అసోసియేషన్ వినతి

విశాలాంధ్ర - జగ్గంపేట: స్థానిక ఏరియా మెడికల్ అసోసియేషన్ సభ్యులు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను కలిసి ఘనంగా సత్కరించి తమ సమస్యల వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు నాళ్ళం గోపి మాట్లాడుతూ మా అసోసియేషన్ పరిధిలో జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో 68 మెడికల్ షాపులు ఉన్నాయని ప్రజల అవసరాలకు అనుగుణంగా నిబంధనలకు లోబడి మందులు విక్రయిస్తున్నామన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి మారుతున్న సాంకేతిక పరిస్థి తులు, మందుల విక్రయాలు, ప్రభుత్వ సూచనలు తదితర అంశాలపై సమావేశాలు నిర్వహించి అందరికీ అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ సమావేశాలు నిర్వహించు కునేందుకు హాలు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. మెడికల్ అసోసియేషన్ హాల్ నిర్మించుకునేందుకు స్థలం ఏర్పాటు చేయాలని వారు నెహ్రూను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మెడికల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

జానపద కళాకారుల సంక్షేమ సంఘం ఏర్పాటు

విశాలాంధ్ర - కాకినాడ: తూర్పుగోదావరి జిల్లా నుండి కాకినాడ జిల్లాగా విడిపోయి సుమారు 3 సంవత్సరాలు కావస్తున్నది. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలోనే కొనసాగుతూ ఉన్నాము. కాకినాడ జిల్లా పరిధిలో ఉన్న వివిధ కళారూపాల కళాకారుల అందరితో సంప్రదింపులు చేసి 12,13 తేదీలలో కచేరిపేటలో ఉన్న సుందరయ్య భవనంలో ఆంధ్రప్రదేశ్ జానపద కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణబాబు సూచనల మేరకు జిల్లా కళాకారులు అందరి సమక్షంలో కాకినాడ జిల్లా జానపద కళాకారుల సంక్షేమసంఘం ఏర్పాటు చేశారు.

నూతన కమిటీ ఎన్నిక వివరాలు: గౌరవ అధ్యక్షులుగా పుల్లారావు, గౌరవ ముఖ్య సలహాదారులుగా బుర్రకథ మాస్టారు వెంకటేశ్వరరావు, తోట బాలకృష్ణ, అనపర్తి ఏడుకొండలు, జిల్లా ప్రెసిడెంట్‌గా వీర్నాల కృష్ణ, వైస్ ప్రెసిడెంట్‌గా తోట శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి తోట పవన్ కుమార్, జాయింట్ సెక్రెటరీ వనపర్తి కోటేశ్వరరావు, మహిళా జాయింట్ సెక్రెటరీ విభూతి రాజేశ్వరి, జిల్లా కోశాధికారిగా వీర్నాల ప్రకాష్ రాజు, జాయింట్ కోశాధికారిగా వీర్నాల మహేష్ రాజు, అలాగే జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా తోట దావీదు, తోట చిన్న, దయానందం, దువ్వూరి శేషు కుమారి, మిత్తిపాటి రాణి, నామాల మల్లిబాబు, వీర్నాల రాజు, దివిలి బాబ్జి, తుని కృపాకరం, మాధవపట్నం తోట సత్యం, వీధి నాటిక సత్యం. అలాగే జిల్లాల్లో ఉన్నటువంటి ముఖ్య పట్టణాలు మండలాలని శాఖలుగా విడదీసి ఆయా శాఖలకు అర్హులైనటువంటి కళాకారులను జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గాను, జిల్లా సమాచార కార్యదర్శులుగాను, కళాకారుల సమక్షంలో ఎన్నుకోవడం జరిగినది. ఈ కార్యక్రమం జిల్లా కళాకారుల ప్రెసిడెంట్ వీరనాలకృష్ణ, అనపర్తి ఏడుకొండలు అధ్యక్షతన జరిగింది.

అవినీతి రహితపాలనే ధ్యేయంగా పనిచేయ్యాలి : ఎమ్మెల్యే దేవ

విశాలాంధ్ర - రాజోలు: నియోజకవర్గంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు అవినీతి రహిత పాలనే ధ్యేయంగా పని చేస్తూ ప్రజలకు సేవలందించాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సూచించారు. రాజోలు మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణా తరగతులను మంగళవారం ఎమ్మెల్యే దేవ సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడా అవినీతికి తావు లేకుండా పని చేయాలని ప్రజా ప్రతినిధులను, పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు. గత ఐదేళ్ళ కాలంలో గ్రామ పంచాయతీ నిధులు ప్రక్కదారి పట్టి గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని అన్నారు. జగన్న కాలనీల పేరుతో రాజోలు నియోజకవర్గం లో 86 లేఅవుట్లు వేయగా అందులో 42 లేఅవుట్లు మాత్రమే ఇల్లు నిర్మాణానికి అనుకూలంగా ఉన్నాయన్నారు. మిగిలిన 44 లేఅవుట్లు ఏవిధమైన నివాసానికి పనికిరావు అన్నారు. నియోజకవర్గంలో ప్రధాన సమస్య అయిన డ్రైనేజి వ్యవస్థను పునరుద్దరణకు సాయశక్తులా కృషి చేస్తానని అన్నారు. గ్రామాల్లో పంటపొలాల్లో ఆక్రమణలకు గురైన రైతు వారి బోదులు, రెవెన్యూ బోదులను గుర్తించి వినియోగంలోకి తీసుకురావాలని అన్నారు. కొన్ని చోట్ల మూడు నుండి నాలుగు గ్రామాలకు ఒక్కరే కార్యదర్శి ఉన్నారని దానివలన గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగడం లేదని అన్నారు. ఖాళీగా ఉన్న చోట సచివాలయ కార్యదర్శులను నియమించి వారికి పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించాలని ఎంపిడిఓను ఆదేశించారు. రెండు సబ్ స్టేషన్లకు ప్రతిపాదనలు పంపామని అన్నారు. కరెంటు సమస్య పరిష్కారానికి ప్రాజోలు, లక్కవరం సబ్ స్టేషన్‌లను ఆఫ్ గ్రేడ్ చేస్తామని అన్నారు. సుమారు 10 కోట్ల రూపాయలతో గ్రామాల్లో రోడ్ల నిర్మాణ త్వరలో పనులు చేపడతామని అన్నారు. పార్టీలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి ప్రజలంతా సహకరించాలని ఎమ్మెల్యే దేవ కోరారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ కేతా శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పోలమూరి శ్యాంబాబు, ఎంపిడిఓ నిమ్మగడ్డ బాలాజీ, ఈఓపిఆర్డీ జి భీమారావు, ఆయాగ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటీసీలు, పంచాయతీ, సచివాలయకార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నిత్యావసరాలు పంపిణీ

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లా పెద్దాపురం నియోజకవర్గం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాగ్ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం ఉదయం స్థానిక గ్రీన్ ఫీల్డ్ అందుల పాఠశాల విద్యార్థులకు నిత్యావసర వస్తువులు, భోజనాలు, స్నాక్స్ పంచిపెట్టారు. కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాధవపట్నం గ్రామం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పెంకె వెంకటేష్ బాబు ఆధ్వర్యంలో నిమ్మకాయల రంగనాగ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఒకరి అవయవదానంతో తొమ్మిది మందికి ప్రాణదానం : డా. అడ్డాల

విశాలాంధ్ర - కాకినాడ : స్థానిక రమణయ్యపేట వద్ద కాకినాడ ఐడిఎ ఆధ్వర్యంలో అవయవ దాన దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఐడిఎ సిడిహెచ్ కన్వీనర్ డా అడ్డాల మాట్లాడుతూ' ప్రపంచ అవయవ దాన దినోత్సవాన్ని ఏటా ఆగస్టు 13న నిర్వహిస్తామని, అవయవ దానం గురించి అవగాహన కల్పించి అపోహలను తొలగించడమే ప్రధాన లక్ష్యం అని తెలిపారు. ప్రపంచ అవయవ దాన దినోత్సవం నాడు అవయవాలను దానం చేసిన వారిని గౌరవించడం చేయాలని కోరారు. లీ హెరిక్ మొదటి అవయవ దాత అని డిసెంబరు 23, 1954న తన కవల సోదరుడు రిచర్డ్‌కు మూత్ర పిండాన్ని విరాళంగా ఇచ్చాడని, డాక్టర్ జోసెఫ్ ముర్రే విజయవంతంగా మార్పిడి చేసిన తర్వాత, అతను చేసిన కృషికి 1990లో ఫిజియాలజీ, మెడిసిన్‌లో నోబెల్ బహుమతిని అందుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నిమ్మకాయల వెంకటేశ్వర రావు, రత్నప్రసాద్,రెడ్నంరాజా, మహిళలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా రక్తదానం చేయండి ఎంఈఓ కృష్ణవేణి

విశాలాంధ్ర - కరప : రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని మండల విద్యాశాఖ అధికారిని కెబి కృష్ణవేణి తెలిపారు. స్థానిక కరప చిరంజీవి కల్యాణ మండపంలో యంగ్ మైండ్ సంస్థ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ వారి సారధ్యంలో 78వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకుని 15వ తేదీన ఏర్పాటు చేయు రక్తదాన శిబిరంలో మండల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ స్వచ్ఛందంగా రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలని ఎంఈఓ కృష్ణవేణి పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక చిరంజీవి కళ్యాణ మండపం నందు మండల పాఠశాల ఉపాధ్యాయులందరితో సమావేశం నిర్వహించినట్టు ఆమె తెలిపారు. ఎంఈఓ 2 సత్యనారాయణ ఈ సమావేశంలో మాట్లాడుతూ ఉపాధ్యాయులు దేశ పౌరులు సైనికులకు, తల సేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు, వివిధ ప్రమాదాలకు గురైన బాధితులకు అండగా ఉండేందుకు ఉపాధ్యాయులు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఆయన కోరారు. ఈనెల 15వ తేదీన స్వతంత్రయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రెడ్ క్రాస్ సొసైటీ వారు ఏర్పాటు చేస్తున్న ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులంతా కలిసికట్టుగా చేయూతనిద్దామని ఎంఈఓ 2 సత్యనారాయణ ఉపాధ్యాయులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో యంగ్ మైండ్ కన్వీనర్ వాకాడ వెంకటరమణ, రాజు, లక్ష్మి, సత్తిబాబు, సుజాత, నాగలక్ష్మి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - అనపర్తి : ఆజాది కా అమృత్ మహోత్సవంలో భాగంగా మంగళవారం రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి ఏడిబి రోడ్డు సెంటర్ వరకు విద్యార్థులు నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డిఏ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

విద్యా వ్యవస్థకు ప్రాధాన్యత : ఎమ్మెల్యే ముప్పిడి

విశాలాంధ్ర - తాళ్లపూడి : ఎన్డీయే ప్రభుత్వం విద్యా వ్యవస్థకు ప్రాధాన్యత కల్పిస్తోందని, కొవ్వూరు నియోజక వర్గంలోని అన్ని జూనియర్ కాలేజీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు కొవ్వూరు శాసన సభ్యులు ముప్పిడి వెంకటేశ్వర రరావు తెలిపారు. ఆయన మంగళవారం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి అక్కడ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రౌండ్ ఫిల్లింగ్ సమస్యను ఎన్ఆర్ఈజీ ఎస్ద్వారా పనులు చేపడతామని, విద్యార్థుల ద్వారానే సేకరించిన అవసరాలను ఒకటొకటిగా పరిష్కరిద్దామని అన్నారు. అన్ని ఇబ్బందులు పరిష్కరిస్తానని ముప్పిడి అన్నారు. గత సంవత్సరంలో మంచిమార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థి నిలను ముప్పిడి అభినందించారు. నాయకులు మాజీ ఎమ్మెల్యే టివిరామా రావు, ద్విసభ్య కమిటీ సభ్యులు కంట మని రామ కృష్ణ, టీడీపీ నాయకులు శివరామకృష్ణ, మండల టీడీపీ అధ్యక్షులు పరమేశ్వ రరావు, జన సేన నాయకులు కృష్ణ, బిజెపి అధ్యక్షులు రామకృష్ణ, శ్రీనివాస్, రాంబాబు, ప్రిన్సిపాల్ శీనివాస్, కాలేజి సిబ్బంది పాల్గొన్నారు.

రిఫ్రెషర్ శిక్షణలో వివిధ అంశాలపై ఎంపీడీవో పరిశీలన

విశాలాంధ్ర - దేవరపల్లి: దేవరపల్లి మండలం రామన్నపాలెంలో మంగళవారం నాడు రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో వివిధ అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు. ఎంపీడీవో ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో పారిశుద్ధ్యం ఘన వ్యర్థాల నిర్వహణపై క్షేత్రస్థాయిలో రామన్నపాలెంలో నిర్వహించారు . పారిశుద్ధం ఘన వ్యర్థాల నిర్వహణ చెత్త సేకరణ పొడి చెత్త వేరు చేయుట వర్మి కంపోస్టు తయారు చేయు విధానం మార్కెటింగ్ చేయటం పరిశీలించారు ఈ సందర్భంగా క్లాప్ మిత్రులకు అవగాహన కల్పించారు మంగళవారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు రామణపాలనలో ఈ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకర్‌రావు, గ్రామ కార్యదర్శులు రామచంద్రరావు షరీఫ్ అమ్మిరాజు శ్రీనివాసు శ్రీనివాసు సూపరింటెండెంట్ జి శాంతి శిక్షకులు జి కమలావతి యు శివ హరిబాబు సిహెచ్ జగ్జీవన్ రామ్ సర్పంచులు బొంత నాగమణి కూచిపూడి బుల్లారావు శ్రీరంగం రామలక్ష్మి కాట్రగడ్డ పరమేశ్వర రావు గ్రామాల సర్పంచులు గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు. .

అందరూ దేశభక్తి భావం కలిగి ఉండాలి : సీఐ

విశాలాంధ్ర - దేవరపల్లి : ప్రతి వ్యక్తి దేశభక్తి భావం కలిగి ఉండాలని దేవరపల్లి సీఐ బాలసురేష్ పేర్కొన్నారు. దేవరపల్లిలో మంగళవారం హర్‌ఘర్‌తిరంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరపల్లి సెంటర్ నుండి ఆర్టీసీ బస్టాండ్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. సీఐ బాల సురేష్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి దేశభక్తి భావం కలిగి ఉండాలని ఆయన అన్నారు. భారతదేశానికి స్వాతంత్రం సంపాదించిన స్వాతంత్ర సమర యో ధులకు మనం రుణపడి ఉన్నామని అన్నారు. స్వాతంత్ర దినోత్సవాలు సందర్భంగా కేంద్ర ప్రభుత్వం హర్ ఘర్ తిరంగా కార్యక్రమం చేపట్టిం దని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి ఎస్సై సుబ్రహ్మణ్యం ఎంపీడీవో ప్రభాకర రావు ఎంఈఓలు తిరుమలదాసు అప్పారావు దేవరపల్లి స్కూల్ హెచ్ఎం 5బి శ్రీలక్ష్మి, సర్పంచ్ కడిమి వీర కుమారి స్థానిక నేతలు రాజు విద్యార్థులు పాల్గొన్నారు

అక్రమంగా రేషన్ బియ్యం తరలింపు

విశాలాంధ్ర- తాళ్లపూడి : డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో దొరికితే పదివేల రూపాయలు ఫైన్ తప్పదని, అదే రెండవ సారి దొరికారో జైల్ కెళ్లటం ఖాయమని తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ హెచ్చరించారు. ప్రజలంతా మద్యం సేవించి వాహనాలపై తిరగవద్దని, కఠిన చట్టం అమలు అవుతోందని అన్నారు. తమ సిబ్బంది డ్రంక్ అండ్ డ్రైవ్, బీట్ నిర్వహిస్తుండగా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని గుర్తించారని ఎస్సై తెలిపారు. డైరెక్టుగా గోడౌన్ నుండి వచ్చిన గన్ని బాగ్స్ తోనే తరలిస్తున్న 50 కేజీలున్న 30 బస్తాలను, వాహనంతో సహా అదుపులోకి తీసుకున్నామని, దీనిపై కేసు నమోదు చేసి, తదుపరి చర్యలకై తాళ్లపూడి మండల సివిల్ సప్లైస్ అధికారికి అప్పగించామని ఎస్సై తెలిపారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నివారిద్దాం ... ఈవోపీఆర్డి సత్యనారాయణ

విశాలాంధ్ర - కరప : ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నివారించే విధంగా పంచాయతీ కార్య దర్శులు, సర్పంచులు గ్రామ ప్రజలకు అవగాహన కల్పించి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని పంచాయతీ విస్తరణ అధికారి సత్యనారాయణ తెలిపారు. కరప గ్రామంలో స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో రెండో రోజు జరిగిన శిక్షణ కార్యక్రమంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను ఏ విధంగా ఉపయోగించాలి, సంపద ఎలా సృష్టించాలనే దాని పై పంచాయతీ కార్యదర్శులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సునీల్ కుమార్, వీర భద్రరావు, బ్రహ్మానందం, గ్రామ సర్పంచ్ సాగే ఆశాజ్యోతి, తదితర పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తరంగ్

విశాలాంధ్ర - తాళ్లపూడి : స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రధాన మంత్రి మోడీ ఇచ్చిన పిలుపు మేరకు హర్ ఘర్ తరంగ్ కార్యక్రమాన్ని విజయవంతం గా చేపట్టాలని, ప్రతి ఇంటి పై జాతీయ పతాకాన్ని విధిగా ఎగుర వేయాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పిలుపు నిచ్చారు. జూనియర్ కళాశాల పరిశీలించేందుకు వచ్చిన ఎమ్మెల్యే హైస్కూల్ వద్ద ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట నాయకులు, ఎంఇఓ బాలా మణి, హై స్కూల్ ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు సామాజిక స్పృహ ఉండాలి

– జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సునీత గంధం

విశాలాంధ్ర - రాజానగరం : సైబర్ నేరగాలు పన్నే ఉచ్చులో కుటుంబ సభ్యులు పడకుండా యువతే చూడాలని,అలాగే యువత కూడా అప్రమతంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి సునీత గంధం అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డిఎల్ఎస్ఏ), గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జిజియు),గైట్ అటానమస్ కళాశాల సమన్వయంతో మండలంలోని గైట్ కళాశాల ఆవరణలో విద్యార్థులకు డ్రగ్స్ దుర్వినియోగం, యాంటీ ర్యాగింగ్ పై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ యువతకు సామాజిక స్పృహ కలిగి ఉండాలని సూచించారు. ర్యాగింగ్ వల్ల కలిగే నష్టాలను యువ ఇంజనీర్లకు వివరించారు. ఇంజనీరింగ్ విద్యార్థుల అయిన ప్రతీకీ దేశ చరిత్ర గురించిన ముఖ్యాంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు ర్యాగింగ్ కు దూరంగా ఉండాలని ప్రతి ఒక్కరూ తమ లక్ష్యాన్ని నిర్ణయించుకొని ఆ లక్ష్య సాధనకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే.ప్రకాష్ బాబు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు బానిసలు అయితే భవిష్యత్తు జీవితం అంధ కారం అవుతుందన్నారు. అదనపు ఎస్పీ ఎస్. ఆర్. రాజ శేఖర రాజు మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు ఏవిధంగా మోసాలకు పాల్పడుతున్నారో సోదాహ రణంగా వివరించారు. ర్యాగింగ్‌కు పాల్పడిన వారికి చట్ట ప్రకారం శిక్షలు కఠినంగా ఉంటాయని భవిష్యత్తు నాశనం అవుతుందని తెలిపారు. జిల్లా అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ రాజు, జిజియు రిజిస్టర్ డాక్టర్ పి.ఎం.ఎ.ఎస్. శర్మ, గైట్ కళాశాల ప్రిన్సి పల్ డాక్టర్ టి.జయానంద కుమార్, రాజమండ్రి ప్రభుత్వ వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తేతలి రామారెడ్డి వివిధ అంశాలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జి జి యు రిజిస్టర్ డాక్టర్ పిఎంఎఎస్ శర్మ, గైట్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జయానంద కుమార్, రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తేతలి రామారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విభాగంలో జేఎన్‌టీయూకే ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంక్

విశాలాంధ్ర – కాకినాడ : కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)-2024 ర్యాంకింగ్స్‌లో జెఎన్‌టియుకె కాకినాడ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ విభాగంలో 101-150 ర్యాంక్ బ్యాండ్‌లో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు సాధించినట్లు ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ వి రవీంద్రనాథ్ తెలిపారు. ఎన్ఐఆర్ఎఫ్‌లో మెరుగైన ర్యాంక్ సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలను ఆయన వివరించారు. గత ఏడాది ఎన్ఐఆర్ఎఫ్-2023 ర్యాంకింగ్స్‌లో జెఎన్‌టియుకె యూనివర్సిటీ 101-150 ర్యాంక్ బ్యాండ్‌లో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు సాధించిందని, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో 50-100 ర్యాంక్ బ్యాండ్‌లో మెరుగైన ర్యాంక్ సాధించేందుకు యూనివర్సిటీలోని రెగ్యులర్ అధ్యాపకులకు పూర్తిస్థాయి రీసెర్చ్ స్కాలర్‌ను కేటాయిస్తామన్నారు. విదేశీ విద్యార్థుల ప్రవేశాలను మెరుగు పర్చేందుకు తగిన చర్యలు చేపడతామన్నారు. ఎంటెక్, పిహెచ్‌డి వంటి ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులను మరింత ప్రోత్సహిస్తామని, ఫ్యాకల్టీ స్టూడెంట్ రేషియో (ఎఫ్ఎస్ఆర్)ను పెంచేందుకు తగిన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ అనుమతితో శాశ్వత ప్రాతిపదికన అధ్యాపక పోస్టులను భర్తీ చేయవలసి ఉందన్నారు. యూనివర్సిటీలో చేపట్టే ప్రతీ కార్యక్రమంలోను లింగ సమానత్వాన్ని పాటించడం ద్వారా ఎన్ఐఆర్ఎఫ్‌లో మెరుగైన ర్యాంక్ సాధించవచ్చునని ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ వి రవీంద్రనాథ్ వివరించారు.

పేకాట శిబిరంపై దాడి

విశాలాంధ్ర – ఆలమూరు : మండల పరిధిలోని మోదుకూరు గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. పోలీసుల కథనం ప్రకారం పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై ఎం.అశోక్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడుల్లో గొడితి రాజు, పాడిశెట్టి వీర వెంకట సత్యనారాయణ, కొవ్వాడ నవీన్,గంధం విజయకుమార్ అనువారులను అరెస్టు చేసి వారి వద్ద నుండి 2,900 రూపాయలతో పాటు 52 పేక ముక్కలను స్వాధీనం చేసు కుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కాకినాడ హైగ్గీ రెస్టారెంట్‌కు అవార్డు

విశాలాంధ్ర – కాకినాడ : మహిళా పారిశ్రామికవేత్తలను గుర్తించి, వారికి మద్దతునిచ్చే స్విగ్గీ 'షీ ద చేంజ్' కార్యక్రమంలో భాగంగా 'హైగ్గీ మల్టీ క్యూసిన్ రెస్టారెంట్'కి ప్రతిభా పురస్కారం దక్కింది. ఈ మేరకు మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆర్థిక కార్పొరేట్ వ్యవహారా మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా కాకినాడ హైగ్గీ రెస్టారెంట్ అధినేత కాకిలేటి పల్లవి ప్రతిభా పురస్కార ధ్రువపత్రం అందజేశారు. అసాధారణమైన నాయ కత్వం నాణ్యత పట్ల నిబద్ధత ఆమెకు ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపును తెచ్చిపెట్టిందనీ స్విగ్గీలో నేషనల్ బిజినెస్ హెడ్ సిద్ధార్థ్ భకూ చెప్పారు. మహిళల నేతృత్వంలోని వ్యాపారాలకు మద్దతు ఇవ్వ డానికి ఆసక్తి ఉన్నవారికి ఈ రంగంలోకి రావడానికి ఇది తోడ్పడు తుందన్నారు. అక్టోబర్ 2019లో స్థాపించబడిన హైగ్గీబిర్యానీ చైనీస్ వంటకాల నుండి ప్రామాణికమైన దక్షిణ భారత ఇష్టమైన వాటి వరకు విభిన్నమైన మెను ద్వారా అంకితమైన కస్టమర్ బేస్‌ను సంపాదించుకుందన్నారు. భారతదేశం యొక్క అగ్రగామి ఆన్ డిమాండ్ సౌకర్యవంతమైన ప్లాట్‌ఫారమ్ అయిన స్విగ్గీతో భాగస్వామ్యం ఉపయుక్తమవు తుందని పల్లవి సందర్భంగా తెలిపారు. లాక్‌డౌన్ తర్వాత, కస్టమర్ ప్రాధాన్యతలు మార్కెట్ సంభావ్యత గురించి మరింత తెలుసుకునే అవకాశం ఏర్పడిందని చెప్పారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ

విశాలాంధ్ర – మామిడికుదురు : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వేణుగోపాల రెడ్డి ఆధ్వర్యంలో రెండో రోజు మంగళవారం సర్పంచ్లు, సెక్రెటరీలకి ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం పాసర్లపూడి గ్రామంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కేంద్రానికి తీసుకెళ్ళారు. గ్రామంలో సేకరించిన తడి, పొడి చెత్త నుండి సంపద తయారు చేయు విధానంపై వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలనాధికారి కె వెంకటేశ్వర రావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు గుబ్బల దుర్గ, జాలెం రమణకుమారి, కడి అరుణకుమారి, కొనుకు ప్రేమ జ్యోతి, గెద్దం మంగాలక్ష్మి, అల్లు విజయలక్ష్మి, వలవల సత్యవేణి, చుట్టుగుళ్ళ లక్ష్మి, గుబ్బల గీతా భవాని, చెల్లుబోయిన రామ శివ సుబ్రమణ్యం, బళ్ల శ్రీనివాస రావు, తెలగారెడ్డి సూర్యప్రకాశ్ రావు, మద్దాల బాబు రావు, గౌస్ మొహిద్దీన్, సుందరనీడి చిన్ని, రేకాడి సత్యనారాయణ, వివిధ గ్రామాల సెక్రటరీలు సురేష్, పట్టిలింగం, వెంకటేశ్వర రావు, ప్రసాద్, రామకృష్ణం రాజు, మైథిలి, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత హత్య

విశాలాంధ్ర – సీతానగరం: మండలంలో పురుషోత్తపట్నం గ్రామ పంచాయితీ పరిధిలో గల తొర్రిగడ్డ ఎత్తిపోతల పథకం సమీపంలో మంగళవారం వివాహిత హత్య చేయబడిన ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్ళితే దేవిపట్నం మండలం దండంగి గ్రామానికి చెందిన చాట్ల జాన్, భార్య దివ్య భారతి ముగ్గురు పిల్లలు కలిసి కొంత కాలంగా పురుషోత్తపట్నం గ్రామంలో పాన్ షాప్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే వారి ఇరువురు మధ్య కొంత కాలంగా గొడవులు చోటు చేసుకుంటు న్నాయి. ఈ క్రమంలో ఒకసారి భార్య కేసు పెట్టగా జాన్ ఒకసారి జైల్‌కి వెళ్లి వచ్చాడు. అయితే ఈ గొడవలు ఎక్కువ కావడంతో గత పదిహేను రోజులుగా భార్య భర్తలు విడివిడిగా ఉంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం దివ్య భారతి బహిర్భూమికి వెళ్ళగా అక్కడే ఆమె పై దాడి జరిగింది. ఈ దాడిలో ఆమె మెడ, చేతులు, వెనుక భాగంలో కత్తితో నరికిన గాయాలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. దీనిపై స్థానికులు ఆమె భర్త దాడికి పాల్పడినట్టు పిర్యాదు చేశారు. దీనితో సంఘటన స్థలానికి సిఐ అడపా మురళీ, ఇంచార్జి ఎస్ ఐ ఆనంద్ కుమార్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అలాగే క్లూస్ టీమ్ రంగంలోకి దిగి ఆధారాలను సేకరించారు. ఆమె భర్త పరారీలో ఉన్నాడు.దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

చెట్టు కూలిపోవడం బాధాకరం

శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర – కొవ్వూరు రూరల్ : కుమారదేవంలోని సినిమా చెట్టు మొన్న కురిసిన అకాల వర్షాలకు చెట్టు కూలిపోవడం చాలా బాధాకరంగా ఉందని కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఈ చెట్టు దగ్గర సుమారు 300 సినిమాలు తీశారని, ఈ చెట్టు పేరు మీద సినిమా హీరోలను చూస్తాం అని గ్రామస్తులు అందరూ చెబుతున్నారని అన్నారు. సినిమా చెట్టు పునరుద్ధించడానికి రోటరీ క్లబ్ వారు ముందుకు రావడం చాలా హర్షించదగ్గ విషయమని వారికి న్యాయంతో సహకారం అందిస్తానని ముప్పిడి వెంక టేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, తెలుగుదేశం పార్టీ నాయకులు సూర్యదేవర రంజిత్, మద్దిపట్ల శివరామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, టీవీ రామారావు, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు

తైక్వాండో పోటీలకు దీప్తి ఎంపిక

విశాలాంధ్ర – మామిడికుదురు : ఈ నెల 17వ తేదీన విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు మామిడికుదురు దీప్తి డిగ్రీ కళాశాల మొదటి సెమిస్టర్ బీఎస్సీ విద్యార్థి కదలి దివ్య తేజ వెంకటేష్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డివివి సత్యనారాయణ మంగళవారం తెలిపారు. ఈ నెల 11న కాకినాడలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించినందుకు ఈ ఎంపిక జరిగినట్లు డీవీవీఎస్ చెప్పారు. ఈ సందర్భంగా వెంకటేష్‌ను ఆయనతో పాటుగా కోచ్లు కె చిన్న, ఆర్ మణికుమార్, సహాయ ప్రిన్సిపాల్ మోకా రంగారావు, యాలంగి రవికుమార్, పెచ్చెట్టి రాధ తదితరులు అభినందించారు.

జర్నలిస్టులకు జాతీయ జెండాలు అందజేత

విశాలాంధ్ర – అమలాపురం : అమలాపురం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘం ఆధ్వర్యంలో జాతీయ జెండాల ఉచిత పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అమలాపురం ప్రెస్ క్లబ్‌లో పాత్రికేయుల సర్వసభ్య సమావేశంలో పాల్గొని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొండేపూడి సత్యనారాయణ అందరికీ సుమారు వందమందికి జాతీయ జెండాలను అందజేశారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘ అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, సంఘ సభ్యులు వరదా సూరిబాబు, నందిపాటి శ్రీనివాస్, సింగంశెట్టి కుమార్, మోటమర్రి కుమార్, కాళ్లకూరి కుమార్, పచ్చిగోళ్ళ సోమరాజు, పసలపూడి సతీష్, బోనగిరి పంచముఖిలు అందించారు.

చెత్త సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై శిక్షణ

విశాలాంధ్ర – ఏలేశ్వరం : మండల సర్పంచులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులలో భాగంగా మంగళవారం ఏలేశ్వరం మండలంలోని ఎర్రవరం గ్రామంలో ఎన్‌డబ్ల్యుపిసి షెడ్ వద్ద స్థానిక ఎంపీడీవో ఆధ్వర్యంలో రెండవ రోజు శిక్షణా కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ కెవి సూర్యనారాయణ మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రతి గ్రామంలోనూ వర్మీ కంపోస్టులు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించి ప్రజా ఆరోగ్యం వైపు దృష్టి పెట్టి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 12 గ్రామాల సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వివిధ సచివాలయాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి నాయకుల ఆర్థిక సాయంతో ఏకరూప దుస్తులు అందజేత

విశాలాంధ్ర – గండేపల్లి : గండేపల్లి మండలం మల్లేపల్లి కూటమి నాయకుల ఆర్థిక సహాయంతో మల్లేపల్లి జూనియర్ మహిళ కళాశాల విద్యార్థినిలకు ఏకరూప దుస్తులు కూటమి నాయకులు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మెయిల్ ఓవర్సీర్ స్వామీజీ, సబ్ పోస్ట్ మాస్టర్ అజయ్, బిపిఎంలు పేపకాయల వీర్రాజు, పోస్ట్ ఉమెన్ అమ్మాణి, పోస్ట్ మాన్ బసవరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ ట్యాంకర్‌కు అగ్నిప్రమాదం

విశాలాంధ్ర – తాళ్లరేవు : కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పరిధిలోని అయ్యప్ప స్వామి ఆలయం సమీపంలో 216 జాతీయ రహదారిపై డీజిల్ ట్యాంకర్‌లో మంటలు చెలరేగాయి. వైజాగ్ నుండి యానాం వెళ్తున్న డీజిల్ పెట్రోల్ ట్యాంకర్ టైర్ పేలడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఇది గమనించిన డ్రైవర్ క్లీనర్ భయాందోళనలతో పరుగులు తీశారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి స్థానికులు సమా చారం అందించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా పోలీసులు ట్రాఫిక్‌ని నిలిపివేశారు. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఆందోళనకర పరిస్థితి నెలకొంది. సమయానికి ఫైర్ ఇంజన్లు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటన సోషల్ మీడియాలో వైరల్ కావడంతో చూసేందుకు పెద్ద ఎత్తున సమీప గ్రామాల ప్రజలు అక్కడికి తరలివచ్చారు. కోరంగి పోలీసులు, మూడు ప్రాంతాలకు చెందిన ఫైర్ ఇంజన్లు, సిబ్బంది సమిష్టి కృషితో మంటలను పూర్తిస్థాయిలో అదుపులోకి తీసుకొచ్చారు. పరిసర ప్రాంత ప్రజలు పెను ప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఒరిజినల్ దస్తావేజు పోయినది

అనపర్తి మండలం అనపర్తి గ్రామానికి చెందిన కర్రి ఆనంద రెడ్డి s/o బాపిరెడ్డి (లేటు) అనే పేరుతో 2585/1992 నెంబర్ గల ఒరిజినల్ దస్తావేజు తీసుకుని జిరాక్స్ కొరకు వెళుచుండగా దారి మధ్యలో పడిపోయింది దస్తావేజు ఎవరికైనా దొరికినచో దయచేసి అందజేయగలరు.

మా అడ్రస్: కర్రి ఆనంద రెడ్డి,
S/O బాపిరెడ్డి (లేటు)
నెంబర్ 8-182, కుమ్మర వీధి అనపర్తి.
సెల్: 8885278549, 9908316123

31లోపు పీఏసీఎస్‌లో కంప్యూటరైజేషన్

- అధికారులను కలెక్టర్ మహేష్ కుమార్ ఆదేశం

విశాలాంధ్ర - అమలాపురం : ఆగస్టు 31లోపు జిల్లాలోని అన్ని ప్రైమరీ అగ్రికల్చర్ సొసైటీలలో కంప్యూటరైజేషన్ పూర్తిచేయాలని కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అమలాపురం కలెక్టరేట్లోని కలెక్టర్ వారి చాంబర్లో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ 3వ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జిల్లాలోని సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్లపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 166 ప్రైమరీ అగ్రికల్చర్ క్రెడిట్ సొసైటీలను ఆగస్టు 31 లోపు కంప్యూటరైజేషన్ చేసేలా చర్యలు తీసుకోవాల న్నారు. కంప్యూటరైజేషన్‌లో భాగంగా డేటా క్యాప్చర్ టూల్ ద్వారా జిల్లాలోని పిఏసిఎస్‌లోని సభ్యుల వివరాలు, పిఏసిఎస్ ఇచ్చిన లోన్లు, సొసైటీల ఆస్తులు తదితర వివరాలను క్యాప్చర్ చేసి ఆన్లైన్లో ఉంచాలన్నారు. జిల్లాలో నాలుగు పిఏసి ఎస్‌లు పెట్రోల్ బంకులు నడపడానికి అనుమతుల కోసం దరఖాస్తు చేసి ఉన్నాయని, సంబంధిత సొసైటీలకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు. కౌలు రైతులు పంట రుణాలు పొందేందుకు ఇబ్బం దులు పడుతున్న నేపథ్యంలో సిసిఆర్సి కార్డులు ఉన్న ప్రతి రైతుకూ పంట రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి. నిషాంతి, జిల్లా సహకార అధికారి మురళికృష్ణ, నా బోర్డు డిస్ట్రిక్ట్ డెవలప్మెంట్ మేనేజర్ సోమి నాయుడు, డిసిసిబీ సీఈఓ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ ఏరియా ఆస్పత్రి సిబ్బంది ధర్నా

విశాలాంధ్ర- తాడేపల్లిగూడెం : మూడునెలల జీతం బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏరియా ఆస్పత్రి కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది తమ నిరసనను రెండో రోజు కూడా కొనసాగించారు. మంగళవారం ఏరియా ఆస్పత్రి ఎదుట ఎ.ఐ.టి.యు.సి. అనుబంధ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. 3ఆస్పత్రిలో సెక్యూరిటీ , శానిటేషన్ , విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందికి కాంట్రాక్టర్ బకాయి పడ్డ జీతాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈపిఎఫ్ సంస్థకు కాంట్రాక్టర్ తన వంతు ప్రీమియం వెంటనే జమ చేయాలని, ఆస్పత్రిలో సిబ్బంది సంఖ్యను పెంచాలని కోరారు. ఏఐటీయూసీ ఏరియా కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కే.లక్ష్మి నారాయణ (కే.ఎల్.) మాట్లాడుతూ జీతాలు రాకపోవడంతో కార్మికులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని బకాయిలు వెంటనే చెల్లించేటట్లు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు మాట్లా డుతూ ఏరియా ఆస్పత్రి కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, వారి సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. యూనియన్ నాయకులు జి.సురేష్, రాంబాబు , శ్రీనివాస్ , ధనాల వెంకటలక్ష్మి, ఎం. నాగమణి , చిన్నామయూరి, జి. వెంకటలక్ష్మి తదితరులు నాయకత్వం వహించారు.

స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి : ఎస్పీ కిషోర్

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : ఈ నెల 15వ తేదీన ఏలూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి నట్లు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ చెప్పారు. ఇందులో భాగంగా స్వాతం త్ర దినోత్సవ వేడుకల ఏర్పా ట్లను సోమవారం జిల్లా ఎస్పీ పరిశీలించారు. ఇప్పటికే 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పోలీస్ పరేడ్ గ్రౌండ్ ని సిద్ధం చేశారు. ఏ విధంగా ఆరోజు నిర్వహించే కవాతు, పోలీస్ జాగిలాల విన్యాసాలు, ఇతరత్రా పోలీసు గౌరవ వందన స్వీకారం తదితర కార్యక్రమాలను ఎస్పీ స్వయంగా పర్యవేక్షించారు. అదేవిధంగా స్వాతంత్ర దినోత్సవ సంబ రాలు నిర్వహించే పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో ప్రజలు తిలకించేందుకు అణువుగా కుర్చీలు ఏర్పాటు చేయడంతో పాటు వాటిని ప్రోటోకాల్ ప్రకారం సిద్ధం చేయాలని సూచించారు. అలాగే స్వాతంత్ర దినోత్సవ వేడుకలు సందర్భంగా ఈ ప్రాంతంలో ట్రాఫిక్ కు ఎటువంటి అంత రాయం కలగకుండా వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాలను కేటాయించాలన్నారు. మైదానం అంతా పరిశుభ్రంగా సిద్ధం చేయాల న్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్.శేఖర్, ఏఆర్ డిఎస్పీ శ్రీహరి, ఆర్ఐ పవన్ కుమార్, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భీమవరం సమగ్రాభివృద్ధిపై దృష్టి

- డ్రైన్లు, రోడ్లు అభివృద్ధికి అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

విశాలాంధ్ర-భీమవరం: భీమవరం పట్టణ అభివృద్ధి పై పక్కా ప్రణాళికతో దృష్టి సారించామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మంగళవారం లొసరి రోడ్డులోని యనమదుర్రు గట్టు పైన చెత్త డంపింగ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెత్త ట్రీట్మెంట్ ప్లాంట్ ను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలు అనుసరించి ప్రతి పట్టణంలో గత 20 సంవత్సరాలుగా భూమి లో నిక్షిప్తమైన లెగసి వ్యర్థాలను త్రవ్వి తీసి ట్రీట్మెం ట్ ప్లాంట్ ద్వారా మట్టిగా మార్చే ప్రక్రియను చేప ట్టాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా 12 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాల లక్ష్యంగా మట్టిగా మార్చే ప్రక్రియ చేపట్టడం జరిగిందని, దీని నిమి త్తం అయ్యే ఖర్చు మొత్తం రూ.96 లక్షలు సంబం ధిత ఏజెన్సీకి ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. వ్యర్థాలు ట్రీట్మెంట్ ప్లాంట్ లో ప్రాసెస్ అయిన తర్వాత వచ్చే మట్టి లాంటి మెటీరియల్ ను ఖాళీ స్థలాల్లో డంపింగ్ చేసి పూడ్చుకోవడానికి ఉపయోగించడం జరుగుతుందన్నారు. దీని కారణంగా భూగర్భ జలాలు కలుషితం కాకుండా ఉండటంతో పాటు, ఏళ్ల తరబడి భూమిలో పొరలలో కరగకుండా మిగిలిపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు ట్రీట్మెంట్ ప్లాంట్ ద్వారా మట్టిగా మార్పు చెందుతాయన్నారు. ప్రతి నగరంలో చెత్త అనేది పెద్ద సమస్యగా తయారైం దని, ట్రీట్మెంట్ ప్లాంట్ ద్వారా దీనికి పరిష్కారం లభిస్తుందన్నారు. నగరంలోని బివి రాజు పార్కును సందర్శించి అధికారులకు పలు ఆదేశాలను జారీ చేశారు. నగరం నడిబొడ్డులో ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే ఏకైక పార్కుగా ఇది ఉందని, దీనిని మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సూచిం చారు. కొలనులోని నీటిని ఫిల్టరైజేషన్ ప్రక్రియ ద్వారా స్వచ్ఛంగా ఉండేటట్లు చూడాలన్నారు. పార్కింగ్ ప్రదేశం, పార్కుకు వెనుక భాగంలో ఏర్పా టు చేసిన ప్రవేశద్వారాన్ని పరిశీలించి, ద్వారానికి ఆనుకుని ఉన్న తోపుడుబళ్లను వెంటనే తొలగిం చాలని ఆదేశించారు. గతంలో తాడేరు రోడ్లో డం పింగ్ యార్డ్ నిమిత్తం కొనుగోలు చేసిన 6.5 ఎకరాల భూమిని పరిశీలించి, డంపింగ్ కు అడ్డం కిగా ఉన్న విషయాలపై ఆరా తీశారు. ఈ స్థలాన్ని వాటర్ ఎనర్జీ ప్లాంట్ లేదా బయోగ్యాస్ మిథైన్ ప్లాంట్ ఏర్పాటుకు వినియోగించాలని మున్సిపల్ కమిషనర్ కు సూచించారు. తరచూ నగరంలో అన్ని ప్రాంతాలలో క్షేత్రస్థాయిలో సందర్శించి ఆయా ప్రాంతాల అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లనున్నట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట భీమవరం మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, మున్సిపల్ ఇంజనీర్ త్రినాధ రావు, అసిస్టెంట్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, తాహసిల్దార్ రావి రాంబాబు, సర్వే, మున్సిపల్, రెవెన్యూ శాఖల సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ధాన్యం వ్యాపారుల అరెస్ట్

విశాలాంధ్ర- నూజివీడుటౌన్ : నియోజకవర్గ పరిధిలో పలువురు రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసి డబ్బులు చెల్లించని వ్యాపారులను రూరల్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. వివరాల్లోకి వెళితే నూజివీడు మండలం అన్నవరంకు చెందిన మల్లూరు వెంకట నాగ చంద్రశేఖర్ అతని సోదరుడు సురేష్ ఇరువురు గత ఏడాది నూజివీడు, ముసునూరు, చాట్రాయి మండలాల్లో 65 మంది రైతులు వద్ద 90 లక్షల విలువైన ధాన్యం కొనుగోలు చేశారు. రైతాంగానికి సొమ్ము చెల్లించకుండా మాయమయ్యారు. దీంతో బాధిత రైతులు మే 25 న నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. రూరల్ సీఐ కొప్పిశెట్టి రామకృష్ణ, ఎస్సై మల్లికార్జున్ రెడ్డి సదరు వ్యాపారుల కోసం గాలించి మంగళవారం అదుపులో తీసుకున్నారు. నిందితులను కోర్టులో ప్రవేశపెట్టగా కోర్టు 14 రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

రెస్క్యూ కార్యకలాపాలు నిర్వహణపై అవగాహన

విశాలాంధ్ర - కాకినాడ : విపత్తు సంభవించినప్పుడు రెస్క్యూ కార్య కలాపాలు సమర్ధవంతంగా నిర్వహించేలా విస్తృత అవగాహన కల్పిం చనున్నట్టు ఎన్డీఆర్ఎఫ్ టీమ్ కమ్మండర్ మన్మోహన్ యాదవ్ తెలి పారు. జిల్లాలో ఫెమెక్స్ విపత్తు నిర్వహణ విన్యాసాలు (FAMEX- Familiari sation Exercise Programme) నిర్వహణలో భాగంగా మంగళవారం ఎన్డీఆర్ఎఫ్ బృందం కాకినాడ పట్టణం సంజయ్ నగర్ వార్డు సచివాల యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్డీఆర్ ఎఫ్ టీమ్ కమ్మండర్ మన్మోహన్ యాదవ్ మాట్లాడుతూ కాకినాడ విపత్తు నిర్వహణ శాఖ కలిసి కాకినాడ జిల్లాలో 20 రోజులు పాటు వరదలు, తుఫా ను, సునామి, భూకంపాలు, అగ్ని ప్రమాదాలు మొదలైన విపత్తుల సమయాల్లో సమర్థవంతంగా పనిచేసేందుకు వీలుగా వివిధ వర్గాల ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా లో తుఫాను ప్రభావిత ప్రాంతలకు సంబంధించి 6 మండలాలలో ఫెమెక్స్ విపత్తు నిర్వహణ విన్యాసాలు నిర్వహించనున్నారన్నారు. ఈ సంద ర్భంగా సచివాలయ సిబ్బందికి సీపీఆర్, స్కూల్ సేఫ్టీ, బ్లీడింగ్ కంట్రోల్, స్ప్లిప్టింగ్ తదితర భద్రత చర్యలపై ఎన్డీఆర్ఎఫ్ బృందం విన్యాసాలు నిర్వహించారు. లిఫ్టింగ్, మువింగ్, ఇంప్రూవైజ్ స్ట్రక్చర్ ఇతర లైఫ్ సేవింగ్ పద్ధతులను సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో అర్బన్ తహశీల్దార్ వి జితేంద్ర ఇతర రెవెన్యూ, సచివాలయం సిబ్బంది లైజింగ్ అధికారి జగదీష్ ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టులు ఇన్సూరెన్స్‌ను రెన్యువల్ చేయించండి ...

విశాలాంధ్ర - అమలాపురం : జర్నలిస్టుల ఇన్స్యూరెన్స్ రెన్యువల్ జాప్యం చేయకుండా అందరూ వెంటనే చేయించాలని అమలాపురం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొండేపూడి సత్యనారాయణ కోరారు. అమలాపురం ప్రెస్ క్లబ్ మీడియా నూతన కార్యవర్గం ఎన్నిక అమలాపురం ప్రెస్ క్లబ్ భవన్‌లో మీడియా సర్వ సభ్యుల సమావేశం సీనియర్ పాత్రి కేయులు కొండేపూడి సత్య నారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ప్రింట్ మీడియా నూతనకార్యవర్గం ఎన్నిక అయింది. గౌరవ అధ్యక్షులుగా చొల్లంగి అప్పాజీ ఎన్నికయ్యారు. అధ్యక్షులుగా కొండేపూడి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా వట్టి కూటి గోవిందరావు, కోశాధికారిగా గారపాటి నాగేశ్వరావు, ఎన్నికయ్యారు. కార్యనిర్వాహకకార్యదర్శి గా కడలి సూరిబాబు, ఉపాధ్యక్షులుగా దుర్గాప్రసాద్, వెంకటరమణమూర్తి, బూల శామ్యూల్, సం యుక్త కార్యదర్శులు : దడాల త్రిమూర్తులు, ఆకుల సురేష్, కార్యవర్గ సభ్యు లుగా పెయ్యల వెంకటేశ్వరరావు, ఉటాల చిరంజీవి, నిముషకవి పుల్లయ్య శర్మ, బొమ్మిడి హరిబాబు, వెంకట సుబ్బారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మున్సిపల్ ఉద్యోగుల నిరసన ర్యాలీ

విశాలాంధ్ర - యానాం : కేంద్ర పాలిత ప్రాంతమైన యానాంలో మున్సి పల్ ఉద్యోగులు మం గళవారం ఆందోళన నిర్వహించారు. తమ న్యాయమైన కోరికలు తీర్చాలంటూ యానాం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి నిరసన తెలియజేశారు. మొత్తం ఆరు డిమాండ్లు పరిష్కారం కోరుతూ పుర వీధుల్లో ఆందోళన చేశారు. బకాయి పడిన జీతాలను అందించాలని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని, డిఏటి ద్వారా జీతాలు ఇవ్వాలని, ఉద్యోగులు పెన్షనర్లకు సంబంధించిన ఆరు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని యానాం పరిపాలనాధికారి మునుస్వామికి అందజేశారు.